

# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

సోమవారం 30 డిసెంబర్ 2024



## రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసేన నేత కుటుంబానికి లక్ష చెక్కు అందజేసిన పవన్‌కళ్యాణ్

**రాజంపేట అర్బన్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:**



ఈనెల 22న రెడ్డి పల్లె చెరువు కట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందిన జనసేన నేత కుటుంబానికి ప్రభుత్వం తరపున ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ లక్ష రూపాయల చెక్కును తక్షణ ఆర్థిక సహాయం కింద డిప్యూటి సీఎం సమక్షంలో అందజేశారు. రోడ్డు ప్రమాదం విశయాన్ని తెలుసుకున్న పవన్‌కళ్యాణ్ వెంటనే కలెక్టర్‌తో మాట్లాడారు. రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో పాటు రాజంపేట నియోజకవర్గ జనసేన నేతలు కూడ పవన్‌కళ్యాన్ దృష్టికి తీసుకుపోవడంతో ఆయన స్పందించారు. ఈ మేరకు సమీప కుటుంబ సభ్యులకు మృతుడు కోలాటం నరసింహ రక్త సంబంధీకులకు లక్ష రూపాయల చెక్కును అందించారు. ఇప్పటికే నియోజకవర్గ జనసేన నేత అతికారి కృష్ణ, నియోజికవర్గ సమన్వయ కర్త ఎల్లటూరి శ్రీనివాస రాజులు మృతుల కుటుంబానికి సెరి 50వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు.

## అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

**- సీడీపీవో నాగవేణి**

**తంబళ్లపల్లె, డిసెంబరు 29, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె ఐసీడీఎస్ పరిధిలోని ఖాళీగా ఉన్న మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకురాలు పోస్టులకు అర్హులైన అభ్యర్థులు జనవరి 2వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో నాగవేణి విలేకరులకు తెలిపారు. అంగన్‌వాడీ సహాయక పోస్టులకు తంబళ్లపల్లె మండలంలో అప్పమ్మగారిపల్లి (బీసీడీ) మర్రిమాకులపల్లి (ఓసీ) కొటాల (ఎస్సీ), గోపిదిన్నె (ఎస్సీ), దిగువ సఉగాలితాండ (ఎస్టీ), ఉప్పులూరువాండ్లపల్లి (ఓసీ), మండెంవారిపల్లి (ఎస్సీ), మూలపల్లి(బీసీ ఏ), కురబలకోట మండలంలో నందిరెడ్డి గారిపల్లి (ఈడబ్ల్యూఎస్) కమతంపల్లి(ఎస్సీ) చనేత నగర్ (బీసీబీ), పెద్దమండెం మండలం గుడిసివారిపల్లి (హెచ్‌హెచ్) కురబలకోట మండలం ఆర్సీ కురవపల్లి మినీ అంగన్‌వాడీ పోస్టుకు ఓసీ అభ్యర్థులు తమ దరఖాస్తులను 2025 జనవరి 5వ తేదీ లోపు పూర్తి వివరాలతో తంబళ్లపల్లె ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# కడప-రేణిగుంట జాతీయ రహదారి నిర్మాణం పనులు త్వరలో ప్రారంభం

**కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మాట్లాడిన సీఎం చంద్రబాబు... కేంద్ర మంత్రితో ఎంపీలు మేడా రఘు, మిథున్ రెడ్డి, అవినాష్ భేటి**

'వార్త' ప్రభావం



కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరికి వినతిపత్రం అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ రెడ్డి, కడప రాజంపేట ఎంపీలు అవినాష్ రెడ్డి, మిథున్ రెడ్డి



2254 కోట్ల వ్యయంతో చేపట్టిన...

కడప-రేణిగుంట జాతీయ రహదారి ప్రాజెక్టు టెండర్లు రద్దు?

ఈనెల 5న కడప-రేణిగుంట జాతీయ రహదారిపై వార్తలో వెలువడిన కథనం

**రాజంపేట అర్బన్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:**

కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ 2299.05కోట్ల వ్యయంతో చేపట్టిన కడప-రేణిగుంట జాతీయ రహదారి(ఎన్‌హెచ్ 716) పనులు త్వరలో ప్రారంభం అయ్యే దిశగా అడుగులు పడుతున్నాయి. 'వార్త' దినపత్రికలో ఈనెల 5న 'కడప-రేణిగుంట జాతీయ రహదారి ప్రాజెక్టు టెండర్లు రద్దు?' శీర్శికన వెలువడిన వార్త కథనం ఎన్డీఏ ప్రభుత్వంతో పాటు వైఎస్సార్ కాంగ్రేస్ పార్టీ స్పందించింది. వార్త దినపత్రికలో వెలువడిన కథనం గురించి పార్టీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు ఆయన ఇటివల ఢీల్లీకి వెళ్లినప్పుడు కడప-రేణిగుంట గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ఉపరితల రవాణా శాఖా మంత్రి నితిన్ గడ్కరిని కోరినట్లు సమాచారం. ఇప్పటికే టెండర్లు పూర్తి అయి రెండు సంవత్సరాలు అయిందని మరళా కొత్త టెండర్లు అంటే ఆలస్యం అవుతుందని చెప్పినట్లు తెలిసింది. అలాగే వార్త కథనానికి స్పందించిన రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్ రెడ్డి, కడప, రాజంపేట ఎంపీలు వైఎస్ అవినాష్ రెడ్డి, మిథున్ రెడ్డిలు కేంద్రమంత్రి గడ్కరిని కలిసి వినతిపత్రం కూడ అందజేశారు. పనులు ప్రారంభం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టెండర్లు రద్దు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని వివరించారు. పనులు త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి తమకు హామి ఇచ్చారని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి వార్తకు తెలిపారు. అంతేకాకుండా అటవీ పర్యావరణ అనుమతులు ఆలస్యం అవుతుండటంతో వాటిపై కూడ సంబంధిత కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కూడ కలిసి అనుమతులు త్వరగా మంజూరు చేయాలని కోరామన్నారు. ఇప్పటికే అటవీ శాఖ అనుమతులు ఇచ్చామని కేంద్ర మంత్రి చెప్పినట్లు తెలిపారు. అలాగే పర్యావరణ అనుమతులు కూడ త్వరలోనే ఇచ్చేందుకు అవసరమైన ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపినట్లు పేర్కొన్నారు. జాతీయ రహదారి నిర్మాణం పనులు దక్కించుకున్న లక్ష్మీ ఇన్ ఫ్రా సంస్థ ప్రతినిధులతో కూడ తాను స్వయంగా ఫోన్ చేసి మాట్లాడినట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని సంస్థ పేర్కొందని రఘునాథ రెడ్డి వివరించారు. వారం రోజుల క్రితం ఎన్‌హెచ్ఏఐ తిరుపతి ప్రాజెక్టు అధికారి అధికారికంగా ఫారెస్ట్ క్లియరెన్స్ మంజూరైనట్లు ప్రకటన కూడ విడుదల చేశారు. ఈ నేపథ్యంలో అటు సీఎం, ఇటు వైసీపీ ఎంపీలు పనులు ప్రారంభం అయ్యేలా కోరడంతో టెండర్లు రద్దు చేస్తే మరింత జాప్యం జరిగే అవకాశం ఉందని భావించిన ఎన్‌హెచ్ఏఐ త్వరగా పనులు ప్రారంభించేలా గుత్తేదారున్ని ఆదేశించినట్లు తెలుస్తోంది. రెండు సంవత్సరాలలో పూర్తి కావాల్సిన ఈ ప్రాజెక్టు టెండర్లు పూర్తి అయ్యే రెండేళ్లు కావస్తున్న తరుణంలో త్వరలో పనులు ప్రారంభిస్తారని వెలువడిన సమాచారంతో సర్వత్రా కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో సంతోషం వ్యక్తం అవుతోంది.



బద్వేలు సత్యనారాయణ స్వామి దేవలంలో బ్రాహ్మణ సంఘం సమావేశం

## సగిలేరు డ్యామును ప్రక్షాళన చేయాలి

**: గత ప్రభుత్వం నిర్లక్ష్యం వలన నేటికి ఇక్కట్లు**

**: ఎల్ఎస్‌పీ డ్యామ్ చైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి**

**బద్వేలు, డిసెంబరు 29 , ప్రభాతవార్త :**



సగిలేరు డ్యాము అస్తవ్యస్థంగా తయారైందని, పూర్తిగా ప్రక్షాళన చేస్తే తప్ప రైతులకు న్యాయం జరగదని అధికారులతో చర్చించి లోపాలను సరి దిద్దుతామని ఎల్ఎస్‌పీ డ్యామ్ చైర్మన్ ఈగ వెంకటరమణారెడ్డి అన్నారు. గత ప్రభుత్వంలో ఎల్ఎస్‌పీని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని దీని వలన కొంతమంది రైతులే బాగుపడ్డారు తప్ప మిగిలిన రైతులు నష్టపోయారని, పూర్తిగా పరిశీలన జరిపి ప్రతి ఎకరాకు నీరు అందించేవిధంగా ప్రణాళిక సిద్ధంచేస్తున్నామన్నారు. ప్రతి ఏటా బ్రహ్మంసాగర్ నుంచి ఎల్ఎస్‌పీకి నీరు సమృద్ధిగా వచ్చినప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోలేకపోవడం వలన కొంతమంది రైతులకే లాభం చేకూరుతోంది. గత ప్రభుత్వంలో తూము గేట్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని కొన్ని చోట్ల మాయం చేశారని ఆ ప్రాంతంలో మట్టితో కప్పడం వలన నీరంతా వృధాగా పోతున్నాయన్నారు. ఎవరికీ నీరు అవసరమైతే వారికి ఉపయోగపడేలా మార్చుకున్నారు తప్ప అందరికీ ఉపయోగపడేలా కనపడడం లేదన్నారు. దీనికోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఎల్ఎస్‌పీ ప్రక్షాళనకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు చర్చించడం జరిగిందని స్థానిక అధికారులతో ఎల్ఎస్‌పీ పరిసర ప్రాంతాలు కలియ తిరిగామన్నారు. ఎల్ఎస్‌పీ డ్యామ్ ద్వారా వేల ఎకరాలకు నీరు ఇచ్చే కల్పవృక్షం లాంటిదని దీనిని దుర్వినియోగం చేసుకోకుండా అందరికీ ఉపయోగపడేలా చేయాలన్నదే సంకల్పమని చైర్మన్ వెంకటరమణారెడ్డి అన్నారు. అంతేకాకుండా మాపై నమ్మకంతో రైతులకు న్యాయం చేయాలని టీడీపీ నియోజకవర్గ సమన్వకర్త రితేష్ రెడ్డి ఆదేశించారని, అదేవిధంగా వారి ఆదేశాలను అనుసరిస్తూ ఎల్ఎస్‌పీ ప్రక్షాళనకు త్వరలో చర్యలు చేపడతామన్నారు.

# నడిరోడ్డుపై లోపించిన పారిశుద్ధ్యం


**:పందుల సంచారంతో బెంబేలెత్తుతున్న ప్రజలు**

**:దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న పాదచారులు**

**:పట్టించుకోని మున్సిపల్ అధికారులు**

**బద్వేలు, డిసెంబరు 29 ప్రభాతవార్త:**

పట్టణంలోని నడిరోడ్డులో పారిశుద్ధ్యం లోపించి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సచివాలయ సిబ్బంది గాని, మున్సిపల్ అధికారులు గాని పట్టించుకోవడం లేదు. ఇండ్లలోని చెత్తా, చెదారాన్ని నిర్దేశించిన ప్రదేశంలో వేయాలి తప్ప ఎక్కడా వేయరాదని,అలా వేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ హుకుం జారీ చేశారు. ఆ విధంగా ప్రజలంతా చెత్తకుండీలో వేస్తే అదంతా విస్తరించి పందులు సంచరించి రోడ్డున తిరగాలంటే వేలమంది పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. పోరుమామిళ్ల రోడ్డులోని కాలువగట్టు వద్ద కుండీలో చెత్త పేరుకుపోయి ఎన్ని రోజులు అయిందో అన్నట్లుగా దర్శనమిస్తోంది. పట్టణమంతా పరిసరాల పరిశుభ్రంగా ఉండాలని అధికారులు చెబుతున్నారే తప్ప వాటిని పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నట్లుగా లోపించిన పారిశుద్ధ్యం దర్శనమిస్తోంది. పక్కనే నివాసాలు, అటుపక్క దుకాణాలు మద్యలో చెత్త ఉంది. దీనికితోడు పందుల సంచారం. రోడ్డు మీదంతా చెత్త దర్శనమిస్తుంటే చూసిన ప్రతి ఒక్కరూ అధికారులు ఉన్నారా, లేరా అన్నట్లుగా కనపడుతోంది. ఉదయాన్నే రోడ్డుమీదకు వస్తే ఈ చెత్త దర్శనమిస్తుంటే చూసిన ప్రతి ఒక్కరూ అధికారుల తీరుపై మండిపడుతున్నారు. దీనికితోడు సచివాలయ సిబ్బంది చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు తప్ప చెత్తను పారిశుద్ధ్య కార్మికులచేత ఎత్తివేయించాలనే ఆలోచన లేకపోవడం శోచనీయం. వీధులలో అక్కడక్కడా చెత్త పేరుకుపోవడం పరిపాటి. కానీ నడిరోడ్డుపై వేలమంది తిరిగే రహదారిలో ఇలా చెత్త దర్శనమిస్తుంటే చూసిన ప్రతి ఒక్కరూ ఇదేమి పట్టణము అన్నట్లుగా కనపడుతోంది. క్షేత్రస్థాయిలో సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల అలసత్వమే దీనికి కారణమన్నట్లుగా తెలుస్తోంది.ఇప్పటికే ప్రజలు ఎన్నో సార్లు ఈ ప్రాంతంలో చెత్త పేరుకుపోయి పందులు సంచరిస్తుంటే పందులు సంచరిస్తుంటే కొత్త మున్సిపల్ కమిషనర్



పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారనుకుంటున్న తరుణంలో ఇలాంటివి దర్శనమివ్వడం దురదృష్టకరం. చెత్త పేరుకుపోవడం వలన పందుల సంచారంతో వ్యాధులు ప్రబలే అవకాశం లేకపోలేదు.దీనికితోడు దోమలకు నివాసంగా మార్చుకుని ప్రజలకు విషజ్వరాలు సోకే పరిస్థితి ఏర్పడుతోంది. సీజనల్ వ్యాధులతో ప్రజలు అవస్థలు పడుతుంటే ఇలాంటి తరుణంలో పరిసరాలు పరిశుభ్రంగా లేకపోతే ప్రతి ఒక్కరూ జ్వరాలతో ఆసుపత్రికి క్యూ కట్టే పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా ఆ ప్రాంతంలో ఎప్పటికప్పుడు చెత్తను తొలగించకపోతే మాత్రం రోగాలు దరిచేరుతాయని ప్రజల వాపోతన్నారు.

## ధర, దిగుబడి లేని మినుము పంట



**దువ్వూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త:**

రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన మినుము పంట ధర, దిగుబడి లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలో వివిధ గ్రామాల్లో సుమారు 3వేల ఎకరాల్లో మినుము పంట సాగు చేశారు. ప్రస్తుతం దిగుబడి రాక మొదలైంది. ఇటీవల వచ్చిన వాయుగుండాల ప్రభావంతో వర్షాలు రావడంతో మినుము పంట దిగుబడి అంతతమాత్రమే ఉంది. ధర కూడ తగ్గిపోవడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. ఎకరాకు 8నుండి 10కావాల్సిన మినుము పంట దిగుబడి ప్రస్తుతం కేవలం 2లేక3 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వస్తోందని రైతులు వాపోయారు. అలాగే ధర 9500 నుండి 8వేలకు తగ్గింది. ధర ఎందుకు తగ్గిందో అర్థం కావడం లేదని రైతులు వాపోతున్నారు. దిగుబడి తక్కువ ఉన్న సమయంలో ధర పెరగాలని అయితే ఇక్కడ తగ్గడం విశేషం. వ్యాపారస్థుల మాయాజాలమో లేక సిండికేట్‌గా ఏర్పడి ధర తగ్గిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కేవలం ఇద్దరు ముగ్గురు వ్యాపారస్థులు మాత్రమే మినుము పంటను కొనుగోలు చేయడంతో వారి ఇష్టం వచ్చిన రీతిలో ధరలను నిర్ణయించి రైతులను దోపిడి చేస్తున్నారు. ఇక్కడ కొనుగోలు చేసే వ్యాపారస్థులకు ఎటువంటి అడ్డంకులు లేకపోవడంతో రైతులను దోచుకుంటున్నారు. కనీసం ఎటువంటి వ్యాపారం చేస్తున్నారు, ఎంత కొనుగోలు చేస్తున్నారో అని అడిగే అధికారులు లేకపోవడంతో వ్యాపారస్థులు రైతులను దోచేస్తున్నారు. గత వారం రోజులుగా మినుములు కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఎక్కడైనా మినుములు కొనుగోలు చేసేందుకు మార్కెట్ యార్డులలో సౌకర్యం కల్పిస్తే కొద్దిమేర ప్రయోజనం ఉంటుంది. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఆశిద్దాం.

## చెరువులకు జలకళ

**- ఎమ్మెల్యే చొరవతో నీటి మళ్లింపు**

**- వ్యవసాయ పథకం బోరు బావుల్లో పెరిగిన నీటిమట్టం**

**పీలేరు, డిసెంబరు 29 ప్రభాతవార్త:**



పీలేరు మండల పరిధిలో ప్రవహిస్తున్న పింఛానది నుంచి పరిసర ప్రాంతాల్లోని చెరువులకు జలకళ ప్రవహిస్తుంది. మండల పరిధిలోని చెరువులకు పింఛానది నుంచి పిల్లకాలువల ద్వారా నీటిని మళ్లించి చెరువులను నింపుకునేవారు. 2019లో కురిసిన భారీ వర్షాలకు సంబంధించిన వరదలు కారణంగా పింఛానది పోటెత్తింది. దీని కారణంగా పింఛానది నుంచి మండల పరిధిలోని చెరువులకు అనుసంధానంగా ఉన్న పిల్ల కాలువలు కొట్టుకుని పోయాయి. అప్పటి నుంచి కొట్టుకుని పోయిన కాలువల మరమ్మతుల గురించి అధికార పాలకవర్గాలు పట్టించుకోలేదు. 2024 ఎన్నికల్లో పీలేరు ఎమ్మెల్యేగా నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి గెలుపొందడం, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడం జరిగింది. అప్పటివరకు అభివద్ధి జాడలేని పీలేరు మండలంలో ఎమ్మెల్యే చొరవతో అభివద్ధిలో కదలిక వచ్చింది. గత అక్టోబరు, నవంబరులో కురిసిన వర్షాలకు పింఛానది వరద పెరిగింది. అప్పటివరకు పీలేరు మండల పరిధిలో మరమ్మతులకు నోచుకోని పిల్లకాలువలు ఎట్టికేలకు మరమ్మతులు చేపట్టారు.

**ఎక్కడెక్కడ అంటే:**

పింఛానది నుంచి శివరామపురం చెరువు, చింతలచెరువు, యర్రదొడ్డిపల్లె,కొత్తపల్లె సమ్మర్ స్టోరేజీ, అయ్యప్పనాయునిచెరువులకు అనుసంధానంగా ఉన్న పిల్లకాలువలను అభివద్ధి చేయడానికి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవచూపించారు. సింగిల్‌విండో మాజీ చైర్మన్ యల్లెల రెడ్డెప్పరెడ్డికి కాలువల మరమ్మతులు చేసే పని అప్పజెప్పారు. ఆయన జేసీబీతో చెరువులకు నీళ్లు రావడానికి మరమ్మతులు చేయించారు. దీంతో ఈచెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి. పీలేరు అయ్యప్పనాయుని చెరువు నుంచి మొరవపల్లె చెరువుకు పోతుంది. ఈచెరువుకూడా నిండిపోయి అక్కడి నుంచి ఈమొరవ బోడుమల్లువారిపల్లె చెరువుకు నీరు చేరుతోంది.

**- ఈచెరువు నిండితే ప్రయోజనాలు ఇవే:**

ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి చొరవతో పీలేరు మండల పరిధిలోని చెరువులన్నీ నిండిపోయాయి. దీని ఫలితంగా సమీపంలోని వ్యవసాయ, పథకం బోరుబావుల్లో నీటి మట్టం వద్ది చెంది సాగు, తాగునీటి సమస్యకు పరిష్కారం లభించినట్లయింది. రానున్న వేసవిలో ఎక్కడ తాగు, సాగునీటి సమస్య లేకుండా పోయినట్లయింది. దీంతో అధికారులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లోని సిసి రోడ్లు పర్యవేక్షణలోనూ జిల్లా కలెక్టర్

**ఎలాంటి సమస్య ఉన్న తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కారం అంటున్న కలెక్టర్**

**రాయచోటి డిసెంబర్ 29 ప్రభాతవార్త**

అన్నమయ్య జిల్లా అభివృద్ధి పదంలో నడుస్తుందంటే అన్నమయ్య జిల్లా కలెక్టర్ చమకుడి శ్రీధర్ అనే చెప్పవచ్చు అని గ్రామీణ ప్రాంతాల సైతం ప్రజలు రైతులు చెప్పుకుంటున్నారు. ప్రభుత్వం మారిన అనంతరం కలెక్టర్గా అన్నమయ్య జిల్లాకు విచ్చేసిన ఆయన గ్రామీణ ప్రాంతాలలో సైతం జరిగే పనులను కూడా ఒక కలెక్టర్గా వచ్చి పరిశీలిస్తూ తక్షణమే అభివృద్ధిపై తమ చర్యలు తీసుకుంటూ అభివృద్ధి బాటలో గ్రామీణ ప్రాంతాలను నడిపిస్తున్నారంటే చెప్పదగిన విషయం కాదన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వం ఏర్పాటుచేసిన పల్లె పండుగలో భాగంగా సిసి రోడ్లను వేగవంతం చేశారు అంతేకాకుండా వారంలో ప్రతి సోమవారం తనదైన చలిలో రైతులను కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక అన్న సమావేశంలో ప్రతి రైతు సమస్యను ఎప్పటికప్పుడు అక్కడే ఉన్న జిల్లా అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపడంలోనూ ఆయన ముందంజలో ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. అదేవిధంగా రాయచోటిని ప్రభుత్వ నిధులతో అతి సుందరంగా తీర్చిదిద్దేందుకు కూడా తగు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఏది ఏమైనా రాయచోటికి కలెక్టర్గా బాధ్యతలు చేపట్టిన అతి తక్కువ సమయంలోనే ప్రజాభిమానం రైతుల అభిమానం పొంది జిల్లాలో పాలనను వేగవంతం చేయడంలో ఆయన పాత్ర ఎనలేని కృషి ఉందని పలువురు జిల్లా అధికారులతో పాటు గ్రామీణ ప్రాంతాల సైతం నాయకులు కార్యకర్తలు అభిమానులు కూడా చర్చించుకుంటున్నారు. అంతేకాకుండా జిల్లా నలుమూలల నుంచి వచ్చే ప్రతి ఒక్కరికి అర్జీదారులకు కలెక్టరేట్లోనీ స్పందన హాల్లో త్రాగునీరు వాటర్ బాటిల్ పాటు బిస్కెట్లు టీ ని ఇవ్వాలని నిర్ధారించారు దీంతో ప్రతి సోమవారం అర్జీలు తీసుకోనీ వచ్చే అర్జీదారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



## జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

**- అభినందించిన మండల విద్యాశాఖాధికారి**

**సిద్దవటం, డిసెంబరు 29, ప్రభాతవార్త:**

ఇటీవల అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరులో జరిగిన కుస్తీ పోటీలో బాగా రాణించి జాతీయ స్థాయికి ఎంపికైన శ్రీనలంద విద్యార్థులు 10వ తరగతి శ్రీశశాంక్ 9వ తరగతికి చెందిన పాజిల్‌లను మండల విద్యాశాఖాధికారి విలియం రాజు అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరైన ఆయన కాలిగ్రఫీ (చేతిరాత)లో మంచి నైపుణ్యం గల విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి వారికి గుర్తుగా బ్యాడ్జిలను అందజేశారు. చేతిరాత బాగుంటే తలరాత బాగుంటుందని ఇక్కడ చదువుతున్న ప్రతి ఒక్క విద్యార్థి చేతిరాత అద్భుతంగా ఉందని ఇందుకు కృషి చేస్తున్న స్కూలు యాజమాన్యం మరియు చేతిరాత నేర్పుతున్న ప్రశాంతిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బాబు, పాఠశాల కరస్పాండెంట్ బాలు, వెంకట సుబ్బయ్య, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రగతి పథంలో తొండూరు జిల్లా పరిషత్ హై స్కూల్

**తొండూరు డిసెంబరు 29, ప్రభాతవార్త :**

తొండూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 62వ వార్షికోత్సవ సంబరాలు జరుపుకోనున్నారు. 200 మంది లోపు ఉన్న విద్యార్థుల సంఖ్యను 365 కు చేర్చిన ఘనత ప్రధానోపాధ్యాయుడు కె.వి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ప్రగతి పథంలో పయనిస్తోంది. గత విద్యా సంవత్సరము మండల స్థాయిలో ప్రథమ స్థానంలో ఎస్ గౌతం 577 మార్కులతో మండలంలోని అన్ని పాఠశాలల యందు ప్రథమ స్థానంలో నిలిచారు. అదేవిధంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు జిల్లాలో ఎక్కడా లేని విధంగా పూర్వ విద్యార్థుల సంఖ్య తమ యొక్క అనుభవాలను జ్ఞాపకాలను ఇక్కడికి వచ్చి ఉపాధ్యాయులను గౌరవించి వారితో మంచి మర్యాదలు చేసుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాల యందు 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా స్టడీ అవర్స్ నిర్వహించి వారిని మంచి మార్కులతో పాఠశాలకు మరియు ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులకు తగు సూచనలు ఇస్తున్నారు. రేపటి దినము అనగా డిసెంబర్ 30,31 తేదీన 62వ వార్షికో



త్సవ సంబరాలను పాఠశాల యందు ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు అదేవిధంగా గత సంవత్సరము 8వ తరగతి విద్యార్థిని విద్యార్థులు ఎన్ ఎమ్ ఎస్ లో ప్రతిభ చూపి స్కాలర్షిప్పులకు విద్యార్థులు ఎంపిక అవడం జరిగింది అదేవిధంగా ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారిని ఉన్నత స్థానాలకు పంపే ప్రయత్నాలు కూడా చేస్తున్నామని తెలియజేశారు.

## వైసీపీ నుంచి 60 కుటుంబాలు టీడీపీలోకి చేరిక



**సిద్దవటం, డిసెంబరు 29, ప్రభాతవార్త:**

సిద్దవటం మండలంలోని మాధవరం-1 పంచాయతీ ఎస్.కె.ఆర్.నగర్ గ్రామంలో ఆదివారం టీడీపీ యువ నేత అవ్వారు రాజారాం ఆధ్వర్యంలో 60 కుటుంబాలు పద్మశాలీయులు వైసీపీ నుంచి రాజంపేట నియోజకవర్గ ఇన్ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఉక్కడాల శివ, జింకా శ్రీనివాసులు తదితర కుటుంబాలు పెద్దఎత్తున పార్టీలో చేరారు. 2016 నుంచి వైసీపీకి సానుభూతిగా ఉన్న కుటుంబాలు టీడీపీలో చేరడంతో వైసీపీకి గట్టి దెబ్బ తగిలింది. ఈ సందర్భంగా టీడీపీ ఇన్ఛార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పద్మశాలీలు తిరిగి సొంత గూటికి రావడం సంతోషకరమన్నారు. పేద బలహీన వర్గాల ఆశాజ్యోతి తెదేపా అని చేనేత కుటుంబాలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటానన్నారు. భద్రాద్రి బావ నారాయణ చేనేత ట్రస్ట్కు పూర్తిగా సహకరిస్తానని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి మీ సమస్యలు తీసుకెళ్లి పరిష్కారం చేసే విధంగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. బీసీలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షులు పుత్తా రామచంద్రయ్య, కార్యదర్శి నాగమునిరెడ్డి, గీతాంజలి విద్యా సంస్థల అధినేత వెంకటరమణ, అధికార ప్రతినిధి రామ్మోహన్ నాయుడు తదితర మండల పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

## విష్ణు స్వరూప్ పార్థివ దేహానికి ఘన నివాళులు



**సిద్దవటం, డిసెంబరు 29, ప్రభాతవార్త:**

మాజీ మంత్రి ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య తనయుడు శుక్రవారం విష్ణు స్వరూప్ గుండె నొప్పితో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న సిద్దవటం మండలం బొగ్గిడివారిపల్లె గ్రామ నివాసి పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుప్పాల వెంకట సుబ్బయ్య పార్థివ దేహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి చిన్న వయసులో ఛాతి నొప్పితో విష్ణుస్వరూప్ మృతి చెందడం చాలా బాధాకరమని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి హరిప్రసాద్ పాల్గొన్నారు.

## చెరువుల్లో యువకులు చేపల కోసం వేట...



**రామసముద్రం, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**

రామసముద్రం శివార్లలోని ప్రతి చెరువు నిండి మొరవ వెలుతోంది. కింద చెరువుల నుంచి పై చెరువులకు వచ్చే మొరవ నీళ్ళ గుండా చిన్న చేపలు వస్తాయి. ఇలా వస్తున్న చేపలను కొందరు వలలు ద్వారా పడుతున్నారు. మరి కొందరు గాలం ద్వారా పెద్ద చేపలను పడుతున్నారు. ఏన్నో ఏళ్ళ తరువాత చెరువుల్లోకి నీరు చేరడంతో చేపల కొరత తీరినట్లైంది. పలు రకాల చేపలు చెరువుల్లోకి చేరుతున్నాయి. మామూలుగా చెరువులు నిండి అనేక సంవత్సరాలు అవుతున్నా ఏళ్ళ పాటు చేపగుడ్లు అంతరించకుండా నీళ్ళు రాగానే అవి పగిలి చేపలుగా మారుతాయి. ఈ విదంగా మారిన చేపలు చెరువుల్లోకి వస్తున్నాయి. వీటిని పట్టేందుకు యువకులు, విద్యార్థులు, రైతులు కొద్ది రోజులుగా చెరువుల్లో చేపలు పడుతున్నారు. స్థానికంగా చేపలు దొరకకపోవడంతో బయట ప్రాంతాల వ్యాపారులు తెచ్చే వాటిపైనే ఆధారపడేవారు. ఇప్పుడు ఆ కొరత తీరింది. మండలంలోని పలు చెరువుల్లో ఉదయంనుంచి సాయంత్రం వరకు గాలాల ద్వారా చెరువునీటిలో చేపలు పడుతూ బిజీగా గడిపారు. కింద ఉన్న చెరువులు నిండడంతో పై నున్న చెరువుల్లోకి భారీగా చేపలు చేరుతున్నాయి. చేపలను పడుతూ ఎంతో సరాదాగా ఆటవిడుపు చేస్తున్నారు.

## 39ఏళ్ళ తరువాత పూర్వ విద్యార్థుల కలయిక

**ములకలచెరువు, డిసెంబర్ 29 ప్రభాతవార్త :**

పూర్వ విద్యార్థులు 39ఏళ్ళ తరువాత కలుసుకోవడంతో వారి ఆనందానికి రెక్కలు వచ్చాయి. మొలకలచెరువు జడ్పిహైస్కూల్లో 1984-85సంవత్సరపు విద్యార్థులు. ఆదివారం అదే పాఠశాలలో సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అప్పటి గురువుతో పాటు అప్పటి విద్యార్థులు పాల్గొని సందడి చేశారు. మొదటగా విద్యార్థులు ఒకరిని ఒకరు పరిచయం చేసుకొని వాజి జ్ఞాపకాలను నెమరు వేసుకొన్నారు. అప్పటి గురువులను సన్మానించి వారి ఆశీస్సులు పొందారు. ముందుగా ఉన్నత స్థాయిలో ఉన్న మిగిలిన వారిని కూడా ప్రోత్సహించాలంటూ సమావేశంలో చర్చించుకొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ విద్యార్థులు ప్రసాద్(అప్పి) తోట గిరిధర్, రమేష్, మోబీన్బాష, పెద్దపాలెం నాగేంద్రబాబు, రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఎక్స్పైరీ తేదీ చూస్తున్నారా?



మార్కెట్లో ఏ వస్తువు కొన్నా.. దానిపై తయారీ తేదీ, గడువు తేదీలు కచ్చితంగా రాసుంటాయి. అవి ఎప్పుడు తయారంయ్యాయి? ఎంతకాలం వరకు వినియోగించడానికి సురక్షితం? అనే విషయాల్ని ఇవి తెలియజేస్తాయి. అయితే వీటితో పాటు షెల్ఫ్లైఫ్/ యూజ్ బై అని కూడా కొన్నిటి మీద రాసుంటుంది. చాలామంది ఇది, గడువు తేదీ ఒకటేనేమో అని పొరబడుతుంటారు. కానీ ఈ రెండింటికీ స్వల్ప వ్యత్యాసం ఉందంటున్నారు నిపుణులు. లేబుల్ని సునిశితంగా పరిశీలిస్తే ఆ తేడాను ఇట్టే పసి గట్టేయచ్చంటున్నారు. మరి, అదేంటో తెలుసుకుందాం..

**రెండాంటి మధ్య తేదా ఏంటంటే...** మార్కెట్లో కొనే ఉత్పత్తులపై తయారీ, గడువు తేదీలు ఉంటాయన్న విషయం తెలిసిందే! అయితే వీటితో పాటు షెల్ఫ్లైఫ్ని కూడా ఆయా సంస్థలు లేబుల్పై పేర్కొంటాయి. కానీ ఇది, గడువు తేదీ ఒకటేనేమోనని అనుకుంటారు కొందరు. అయితే ఈ రెండింటి మధ్య స్వల్ప వ్యత్యాసం ఉందంటున్నారు నిపుణులు.

**గడువు తేదీ అంటే...** ఒక ఉత్పత్తిని ఎన్ని రోజుల తర్వాత అస్సలు వాడకూడదో తెలియజేసే కాల పరిమితి. ఆ తర్వాత దాని ప్రభావం తగ్గిపోవడమే కాదు.. అది హానికరం కూడా అని దీని అర్థం.

**అదే షెల్ఫ్ లైఫ్ విషయానికొస్తే..** ఉత్పత్తిని తెరిచిన తర్వాత.. దాని లేబుల్పై పొందుపరిచిన నియమ నిబంధనలకు అనుగుణంగా సరైన నాణ్యతా ప్రమాణా లతో దాన్ని నిల్వ చేయడం/భద్రపరచడం చేస్తే అది ఎంత కాలం సురక్షితంగా ఉంటుందని తెలియజేసే సూచిక ఇది. ఉదాహరణకు 12ఎం అని ఉంటే.. దానికి 12 నెలల షెల్ఫ్ లైఫ్ ఉందని అర్థం! సాధారణంగా దీన్ని ఉత్పత్తిపై 'యూజ్ బై' లేదా సెల్ బై అనే పదాలతో సూచిస్తారు.

షెల్ఫ్ లైఫ్ దాటినప్పుడు ఒకవేళ గడువు తేదీ మీరకపోయినా ఆయా ఉత్పత్తుల్ని వాడకపోవడమే మంచిదంటున్నారు నిపుణులు. ఆహారం, మందులు, కాస్మెటిక్స్. వంటి ఉత్పత్తుల్ని ఉపయోగించే క్రమంలో ఈ రెండు తేదీల్ని దృష్టిలో పెట్టుకోవడం ముఖ్యమంటున్నారు. తద్వారా ఆహారం, అందంపై ప్రతికూల ప్రభావం పడకుండా జాగ్రత్తపచ్చంటున్నారు.

**నిల్వ చేయడమూ ముఖ్యమే!...** అయితే మార్కెట్లో కొన్ని ఉత్పత్తి ఏదైనా సరే.. వాటిపై పేర్కొన్న గడువు, షెల్ఫ్ లైఫ్ తేదీలకు అనుగుణంగా మన్నాలంటే దాన్ని నిల్వ చేసే లేదంటే భద్రపరిచే విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. లేదంటే వాటి నాణ్యత తగ్గిపోయే ఆస్కారం ఉందంటున్నారు ఇందులోసం ఆయా ఉత్పత్తులపై పేర్కొన్న లేబుల్స్ని సునిశితంగా పరిశీలించాలంటున్నారు. ఉదా: ఫ్రిజ్లో పెట్టే ఉత్పత్తుల్ని లేబుల్పై పేర్కొన్న ఉష్ణోగ్రత వద్ద భద్రపరచడం ముఖ్యం అలాగే ఆహారం, మందుల్ని ఫ్రిజ్లో లేదంటే బయట ఉంచినా.. సరైన నిల్వ ప్రమాణాల్ని పాటించాలి.



## ఆరోగ్యానికి 'సూపర్ సిక్స్'

**ఆహారం ప్రపంచంలో అత్యున్నతమైనవిగా. సూపర్ఫుడ్స్కి పేరు. అసలువీటిని ఎవరు, ఎప్పుడు ప్రచారంలోకి తెచ్చారో తెలియదు కానీ ఈ జాబితాలో చాలానే ఉన్నాయి. అకైబెర్రీ, అవకాడో, కాలే, మాచా వంటివి ఎక్కువగా ఆదరణ పొందుతున్నాయి. వీటిల్లో విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు వంటి పోషకాలు పుష్కలం. అయితే, అదే స్థాయిలో న్యూట్రియంట్లను నింపుకొన్ని దేశీయన సూపర్ఫుడ్స్ ఏంటో చూద్దాం.**

**సూపర్ఫుడ్స్,,** ఈ మధ్యకాలంలో బాగా వినబడుతోన్న పదం. వీటిల్లో పోషకాలు పుష్కలంగా ఉంటాయనీ, దీర్ఘకాలిక వ్యాధుల్ని అదుపులో ఉంచుతాయనీ చెబుతున్నారు. అలాంటి వాటిల్లో ఎక్కువగా విదేశీ రకాలే కనిపిస్తున్నాయి కానీ, వాటికి దేశీయ ప్రత్యామ్నాయాలూ ఉన్నాయంటారు పోషక నిపుణులు.

**అకై బెర్రీ-ఉసరి..** చూడడానికి అచ్చం నల్లనద్రాక్షలా ఉండే అకై బెర్రీ, ఉసిరి రెండు ఒకే రకమైన ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉన్న శక్తివంతమైన సూపర్ఫుడ్లు. విటమిన్ సి నిల్వల్లో అకై బెర్రీని మించిన ప్రయోజకారి ఉసిరి. దీంతో పాటు యాంటీ ఆక్సిడెంట్లు, పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. పైగా ఉసిరిలో యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్,యాంటీవైరల్ లక్షణాలూ నిండుగా ఉంటాయి. ఇది దీర్ఘకాలిక వ్యాధుల్నే కాదు.. కాలేయ ఆరోగ్యం, అధికబరువుని తగ్గించడంలోనూ కీలకంగా పనిచేస్తుంది.

## కల్వర్టు లోకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

**రాయచోటి డిసెంబర్ 29 ప్రభాతవార్త**

రాయచోటి వేంపల్లి రహదారిలోని బండపల్లి సమీపాన గల కల్వర్టులో ద్విచక్ర వాహనం బోల్తా పడింది.. దీంతో బైక్ పై వెళ్తున్న ఇద్దరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా మరొకరికి తీవ్ర గాయాలైనట్లు తెలిసింది. సంఘటన స్థలానికి చేరుకున్న వ్యక్తుల సమాచారం మేరకు..భాదితులు ఇద్దరూ .తేజ మినరల్ వాటర్ ప్లాంట్ (మాసాపేట) సర్వీస్ కు చెందిన వాహన డ్రైవర్ లు అని తెలిసింది. వీరిలో ఒకరికి కి స్వల్ప గాయాలు కాగా మరొక బాధితుడు తీవ్రంగా గాయపడిపరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. చికిత్స కోసం 108 అంబులెన్స్ కి సమాచారం అందించడంతో రాయచోటీ లోని ప్రభుత్వ వైద్యశాలకు చికిత్స నిమిత్తం వారిని తరలించారు.

## బద్వేల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాలెండర్ ఆవిష్కరణ

**బద్వేల్ అర్బన్, డిసెంబర్ 29 (ప్రభాతవార్త):**

పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల లో 1985 1986 విద్యా సంవత్సరంలో 10వ తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులైన బద్వేల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్ను ఆవిష్కరించారు. ఆదివారం పట్టణంలోని ఏపీ పెన్షనర్ అసోసియేషన్ సంఘం కార్యాలయంలో నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అనంతరం పలువురికి నూతన క్యాలెండర్ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ బ్యాచ్ అధ్యక్షులుశీలి వెంకటసుబ్బయ్య, ఉపాధ్యక్షులు పత్తి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కొత్తూరు వెంకటరమణ, ఉప కార్యదర్శి చెన్నం శెట్టి చెన్నకేశవులు, కాకర్ల చెన్నారెడ్డి, కోశాధికారి గోనుగుంట్ల రెడ్డి వెంకట సతీష్, జంగిటి శ్రీనివాసులు, తుమ్మలపెంట సుధాకర్, ఉపకోశాధికారి హనుమంతు జయ సింహ మరియు వురి బిండి మనోహర్రెడ్డి, తులసి వెంకట శివ నారాయణ, నిమ్మకాయల శ్రీరాముల రెడ్డి, చిన్ని శ్రీనివాసులు, రామారావు, సకల రాజాతో పాటు పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విజయవాడ తెలుగు మహాసభల్లో రాజంపేట కవికి సన్మానం



**రాజంపేట అర్బన్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:**

విజయవాడలో రెండు రోజుల పాటు జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో రాజంపేటకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కవి గంగనపల్లి వెంకటరమణను నిర్వాహకులు సన్మానించారు. మహాసభల్లో 'అమ్మ భాషను కాపాడుకుందాం...ఆత్మాభిమానం పెంచుకుందాం' అనే నినాదంతో మాతృ భాష వైభవానికి కృషి చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు, చెరుకూరి రామోజీ రావుల పేరుతో నిర్వహించే ప్రధాన వేదికపై 'తెలుగు భాష గూర్చి తెలుపుచుందు' అనే శీర్శికతో గంగనపల్లి వెంకటరమణ సీస పద్యం చదివి వినిపించారు. ఈ పద్యం సభికులను తెలుగు మహాసభ ఉద్దండులను అలరించింది. అందుకు మహాసభల ప్రధాన నిర్వాహకులు డాక్టర్ మండలి బుద్ధ ప్రసాద్, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ తదితరులు అభినందించి జ్ఞాపికను, సర్టిఫికెట్ను అందజేశారు.

## సత్వర చర్యలు తీసుకుంటాం



**కాశినాయన, డిసెంబర్ 29 ,ప్రభాత వార్త**

పోరుమామిళ్ళ మండలంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు సత్వర చర్యలు చేపడతామని ఎమ్మెల్సీ గోవిందరెడ్డి ఆయన తనయుడు దేవసాని ఆదిత్య రెడ్డిలు పేర్కొన్నారు. ఆదివారం పోరుమామిళ్ల పట్టణంలోని ఆప్కాస్ మాజీ డైరెక్టర్ డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఇంటికి వెళ్లి మండల నాయకులతో మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలు చేయలేకనే కూటమి ప్రభుత్వం డైవర్సన్ పాలిటిక్స్ అలాగే త్వరలో అన్ని మండలాల నాయకులతో కలిసి వారి సమస్యలు కూడా అడిగి తెలుసుకుని పరిష్కరించేలాగా ముందుకు వెళ్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సి.భాష, రాజశేఖర్, జడ్పిటిసి ముత్యాల ప్రసాద్, జిల్లా ప్రచార విభాగ అధ్యక్షులు రాజీవ్ బాషా, మాజీ ఉప సర్పంచ్ రాళ్లపల్లి నరసింహులు, వార్డు నెంబర్ తులసి సురేష్, ప్రసాద్, బాలుడు, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులు సాయి నారాయణ రెడ్డి ,పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నీటి కుళాయి గొడవ - వ్యక్తి కాలు నరికిన వ్యక్తులు



**తంబళ్లపల్లె, డిసెంబరు 29, ప్రభాతవార్త:**

తాగునీటి కుళాయి వద్ద తాగునీటి కోసం మహిళలు గొడవపడిన ఘటనలో పురుషులు రంగ ప్రవేశం చేసి ఓ వ్యక్తి కాలు నరికిన సంఘటన మండలంలోని గంగిరెడ్డిపల్లెలో వెలుగు చూసింది. మండలంలోని గంగిరెడ్డిపల్లెకు చెందిన వారు శనివారం వీధిలోని నీటి కుళాయి వద్ద తాగునీటి కోసం గ్రామానికి చెందిన హసీనా, గంగిరెడ్డి కోడలు కవిత ఘర్షణ పడ్డారు. ఈ ఘర్షణ విషయం హసీనా నల్ల చెరువులోని తన సోదరులకు తెలిపింది. ఆదివారం ఉదయం హసీనా సోదరులు కుటుంబ సభ్యులు గంగిరెడ్డిపల్లె గ్రామానికి వచ్చి ఇంట్లో ఉన్న గంగిరెడ్డిపై కొడవలితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన గంగిరెడ్డిని హుటాహుటిన తంబళ్లపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స నిమిత్తం తరలించారు. ఈ విషయమై తంబళ్లపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుడికి జాతీయ విశిష్ట సేవా పురస్కారం

**జమ్మలమడుగు, డిసెంబరు 29, ప్రభాతవార్త:**

జమ్మలమడుగు పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు డా.సత్తెనపల్లి బాబుకు జాతీయ విశిష్ట సేవా పురస్కారం లభించింది. విద్యారంగంలో ఆయన చేసిన కృషికి ఫలితంగా తెలంగాణకు చెందిన పుడమి సాహితీ వేదిక ఈ పురస్కారాన్ని బహూకరించింది. ఆదివారం ఆయన పుడమి సాహితీ వేదిక వ్య వస్థాపక అధ్యక్షులు డా.చిలుముల బాలిరెడ్డి చేతుల మీదుగా ఖమ్మం పట్టణం లో ఈ సత్కారాన్ని అందుకున్నారు. కాగా తెలుగు సాహిత్య పరిరక్షణలో భా గంగా డా.సత్తెనపల్లి బాబు అనేక రచనలు చేశారు. ఓ వైపు ప్రభుత్వ ఉపా ధ్యాయుడిగా పనిచేస్తూ మరో వైపు తెలుగు భాషాభివృద్ధికి తోడ్పాటు అంది స్తున్న సత్తెనపల్లి బాబుకు గతంలో సైతం అనేక అవార్డులు వచ్చాయి. జమ్మల మడుగు వాసికి జాతీయ విశిష్ట సేవా పురస్కారం రావడం పట్ల స్థానికులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



## ఎస్సీ జన సంఘం రాయలసీమ ప్రధాన కార్యదర్శిగా పసుపులేటి చంద్రబాబు



**ప్రొద్దుటూరు డిసెంబర్ 29 ప్రభాతవార్త**

ఎస్సీ జన సంఘం రాయలసీమ ప్రధాన కార్యదర్శిగా పొద్దుటూరు పట్టణానికి చెందిన పసుపులేటి చంద్రబాబు ను నియమించినట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు దాసగానిపల్లె కుళ్ళాయప్ప తెలిపారు. స్థానిక దొరసానిపల్లె రోడ్డులో ఆదివారం రాయలసీమ ప్రధాన కార్యదర్శి గా నియమించిన పసుపులేటి చంద్రబాబుకు ఆయన బాధ్యతలు అప్పగించారు. ముందుగా దళిత సమాఖ్య నాయకులు ఎల్లయ్య మాదిగ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్సీలకు రక్షణ కరువైందని, దాడులు జరిగితే అమలు కావాల్సిన చట్టాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శించారు. చట్టాలు వున్నా అమలు చేసే అధికారులు కరువయ్యారని వాపోయారు. అనంతరం రాయలసీమ ప్రధాన కార్యదర్శి చంద్రబాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. ఈ పదవి అందించిన ఎస్సీ జనసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కుళ్లాయప్ప, రాష్ట్ర అధ్యక్షుడు పెద్ద రాజు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎస్సీ జనసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కుళ్ళాయప్ప మాట్లాడుతూ అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగం ప్రకారం ప్రజా సమస్యల పరిష్కారానికి అవిరామంగా ఎస్సీ జనసంఘం తరపున కృషి చేస్తామని తెలిపారు. ఎస్సీ హక్కుల కోసం, కార్పొరేషన్ నిధుల కోసం, బడుగు, బలహీన వర్గాల కోసం ఎటువంటి పోరాటాలు చేయడానికైనా సిద్ధమని వివరించారు. రాజ్యాంగ నిర్మాత బి. ఆర్. అంబేద్కర్ ను గతంలో అవమానించిన తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని, ప్రస్తుతం అంబేద్కర్ ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా ప్రజా గ్రహానికి గురికాక తప్పదని వివరించారు. బడుగు, బలహీన వర్గాల దాడుల నివారణకు, భూ పంపిణీ కి పోరాడతామని స్పష్టం చేశారు. టిడిపి ఏర్పడి 6 నెలల కాలం అయినా ఇంకా పథకాలు సక్రమంగా అమలు చేయడం లేదని, వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన ఎస్సీ కార్పొరేషన్ కు నిధులు మంజూరు చేయాలని, కోటి పైచిలుకు ఓట్లు వున్న దళితుల అభ్యున్నతికి పాటుపడే వారికే తాము మద్దతు తెలుపుతామని వివరించారు. వైసీపీ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ ల పైనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయడం దారుణమని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం దళితుల అభ్యున్నతికి పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ జనసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెద్ద రాజు, నాయకులు రాంప్రసాద్, వినయ్, పెద్దన్న, మైఖేల్, రమేష్, మనోజ్, విలియం, చిరంజీవి, ఎమ్మార్పీఎస్ సుధాకర్, సుబ్బారాయుడు, పుల్లన్న పాల్గొన్నారు.

## బిజెపి నూతన అధ్యక్షుడు ఏకగ్రీవ ఎన్నిక



**పెనగలూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త:**

పెనగలూరు మండలానికి సంబంధించి బిజెపి అధ్యక్ష ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో కోనేటి రెడ్డి కృష్ణ రాయల్ మండల అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి రిటర్నింగ్ అధికారి వాచర్ల సుబ్బారావు, ఆయనకు నియామక పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రైల్వే కోడూరు అసెంబ్లీ కన్వీనర్ గడ్డం చెంగల్ రాజు, తోట శ్రీనివాసులు, కిసాన్ మోర్చా ఆర్టికల్చర్ కో కన్వీనర్. పులపత్తూర్ రామ సుబ్బారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు గాదెల శ్రీనివాసులు, కోడూరు అసెంబ్లీ కో కన్వీనర్ ఈటి మాపురం సుబ్రహ్మణ్యం మాజీ ఎస్సీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెనగలూరు మండలం మాజీ బీజేపీ అధ్యక్షులు మన్యం మల్లికార్జున, సోమశిల చంద్రమోహన్ మండలం ఉపాధ్యక్షులు పనతల నరేష్, మండల క్రియాశీల సభ్యులు బూత్ అధ్యక్షులు పాల్గొని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మంచ సుబ్బయ్య షేక్ నవాబ్ కరీముల్లా మాడపూరి శ్రీనివాసులు శివయ్య బాలకృష్ణ అశోక్ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

## బిసి ప్రజా చైతన్య సమాఖ్య క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రొద్దుటూరు డిసెంబర్ 29 ప్రభాకర్**

బీసీ ప్రజా చైతన్య సమాఖ్య కార్యాలయంలో ఆదివారం 2025 వార్షిక క్యాలెండర్ను అధ్యక్షులు బొర్రా రామాంజనేయులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొర్రా రామాంజనేయులు మాట్లాడుతూ 2025 సంవత్సరంలో ప్రజలందరికీ మేలు జరగాలని బీసీ సోదరులు రాజకీయంగా మరింత ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చాబోలి దేవేంద్రుడు మాట్లాడుతూ 2025 వ సంవత్సరంలో బీసీ సోదరులకు మరింత మేలు జరిగేటట్లుగా కార్యక్రమాలు రూపొందించి అమలుపరుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి మడకాసంటయ్య, ఉపాధ్యక్షులు పెద్దపుతుల విజయ ప్రతాప్ నాయుడు, వేల్పుల భాస్కర్, కార్యదర్శులు భాస్కర్ రావు, పోసా ఆది నారాయణ మరియు సభ్యులు పరమేశ్వర రావు, తుపాకుల చౌడయ్య, జింక వెంకట కృష్ణయ్య, కొమ్ముద్ది రాముడు, బత్తల శ్రీనివాసులు, సాదు వెంకట చంద్రమోళి, కాటం కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




**MUNICIPAL CORPORATION KADAPA**

**"ap'e-procurement Tender Notice.5398/ATO/MCK dt : 29.12.2024**

| S. No. | Descrition | No.of Works | Ecv.Rs. in Lakhs |
|---|---|---|---|
| 01 | General Funds | 10 | 84.90 |
| | TOTAL :- | 10 | 84.90 |

| | | | |
|---|---|---|---|
| 10 | Bid Document Download Start Date | Bid Document Download End date | Bid Submission Closing Date & Time |
| 10 | 28.12.2024@12.00 PM | 16.01.2025@03.00 PM | 16.01.2025@3.30 PM |

Further details can be seen at 'e' Procurement market place in www.apeprocuremet.gov.in officer inviting bid, Commissioner, Municipal Corporation of Kadapa, A.P.

**Commissioner**
**Kadapa Municipal Corporation**
**YSR District**

## ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన డిసెంబర్ 31 చివరి గడువు

మైదుకూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త:

ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం డిసెంబర్ 31 చివరి గడువు, ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు.ప్రధానమంత్రి పసల్ బీమా యోజన వాతావరణ ప్రమాదాల నుండి కష్టపడి పనిచేసే మన రైతు సోదరులు ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు రబీ సీజన్లో వేసినటువంటి వేరుశనగ, సెనగ, నువ్వులు, మినుములు, పెసర, ప్రొద్దుతిరుగుడు అలాగే రబీలో వేసినటు వంటి వరి పంటలకు ఫసల్ బీమా ఇన్సూరెన్స్ చేసుకోవడానికి చివరి గడువు కావున రైతులందరూ ఇంకా ఎవరైనా మిగిలిపోయి ఉన్నచో ఈ అవకాశాన్ని వినియోగించు కోవాల్సిందిగా మండల వ్యవసాయ అధికారి పసల. ప్రసన్న, ఒక ప్రకటనలో తెలిపారు.

## డిసెంబర్ 31నే పెన్షన్లు పంపిణీ

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబర్ 29, ప్రభాతవార్త:

జనవరి ఒకటవ తేదీన పంపిణీ చేయాల్సిన వివిధ రకాల పెన్షన్లు అన్ని డిసెంబర్ 31వ తేదీనే పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొద్దుటూరు మండలంలో మొత్తం 13642 పెన్షన్లకు గాను ఐదు కోట్ల 74 లక్షల 4 వేల రూపాయలు పంపిణీ జరుగుతుందన్నారు. సచివాలయం సిబ్బంది డిసెంబర్ 31వ తేదీ ఉదయాన్నే పెన్షన్ దారుల ఇళ్ల వద్దకే వచ్చి పెన్షన్లు పంపిణీ చేస్తారన్నారు. కావున పెన్షన్ దారులు అందరూ 31వ తేదీ ఉదయం తమ ఇళ్ల వద్దనే ఉండి సచివాలయం సిబ్బంది ఇచ్చే పెన్షన్లు తీసుకోవాలని ఆయన సూచించారు.

## మామిడి రైతులు ప్రీమియం చెల్లించేందుకు రెండు రోజులే గడువు

బద్వేలు, డిసెంబర్ 29, ప్రభాతవార్త

మామిడి రైతులకు పంట నష్టం భీమాకు సంబంధించి ప్రీమియం చెల్లించేందుకు నేడు మరియు మంగళవారం వరకు మాత్రమే గడువు ఉన్నట్లు బద్వేల్ కు చెందిన అగ్రికల్చర్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా కడప జిల్లా ఇన్చార్జి గూడూరు సునీల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సూచనల మేరకు ఈనెల 16నాటికి గడువు ముగిసినప్పటికీ, మరలా గడువు పెంచుతూ ప్రభుత్వం జీవో జారీ జారీ చేసిన విషయం రైతులకు విధితమేనని, కాగా ఎల్లుండితో ఆ గడువు ముగియండడంతో మామిడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఇందుకోసం రైతులు స్థానిక సిఎస్ సి సెంటర్, ఆన్లైన్ కేంద్రాలలో నమోదు కోసం అవసరమైన బ్యాంక్ ఖాతా జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, భూమి పాస్‌బుక్ జిరాక్స్ క్రాప్ సర్టిఫికేట్ తదితర పత్రాలను తీసుకెళ్లాలని సూచించారు.

## పెన్షనర్లు ఉచిత లైఫ్ సర్టిఫికెట్లు పొందండి

బద్వేలు అర్బన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త,

2025 ఫ్యామిలీ పెన్షనర్స్‌కు సంబంధించి లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని విజయవాడ రాష్ట్ర ఖజానా శాఖ ఆదేశాలు జారీ చేసినట్లు బద్వేలు పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు మీనాక్షి రెడ్డి, కార్యదర్శి కత్తి బ్రహ్మయ్య, కోశాధికారి శీలం గంగన్నలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వారికి2025 జనవరి 2వ తేదీన కూరగాయల మార్కెట్ పక్కన ఉన్న పెన్షనర్స్ కార్యాలయంలో ఉచితంగా లైఫ్ లైఫ్ సర్టిఫికెట్లు చేయబడునని ఈ అవకాశాన్ని పెన్షన్ దారులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఎక్సలెంట్ వాకర్స్ ఇంటర్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ అవార్డు పొందిన శరత్ కుమార్ రాజు





రాజంపేట, డిసెంబర్,29, ప్రభాతవార్త

రాజంపేట సీనియర్ న్యాయవాది, కొండూరు శరత్‌కుమార్‌రాజు ఎక్సలెంట్ వాకర్స్ ఇంటర్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ అవార్డును పొందారు. ఆదివారం పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో శ్రీ కన్వెన్షన్ సెంటర్లో 33వ వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి భారత దేశంలోనే వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో అన్నమయ్య జిల్లా రాజంపేటకు చెందిన సీనియర్ న్యాయవాది కొండూరు శరత్‌కుమార్‌రాజుకు ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా వాకర్స్ ఇంటర్ నేషనల్ ప్రెసిడెంట్ మురళి మోహన్ రావు మాట్లాడుతూ ఒకే రోజు 108మందికి మహాత్మా గాంధీ ఫెలోషిప్ సభ్యత్వాలు నమోదు చేయించి వాకర్స్ ఇంటర్ నేషనల్ చరిత్రను సృష్టించిన ఘనత కొండూరు శరత్‌కుమార్ రాజుదే నని కొనియాడారు. ఇదే కాకుండా వాకర్స్ కోసం లక్షలాది రూపాయలతో రాజంపేట క్రీడా మైదానాన్ని సుందరంగ తీర్చి దిద్ది. పేద ప్రజల కోసం ఎన్నో మెడికల్ క్యాంపులు నిర్వహించి రాజంపేట ప్రజల కోసం పలు సామాజిక కార్యక్రమాలను నిర్వహించిన శరత్ కుమార్ రాజును ప్రముఖ వక్తలు కొనియాడి ఆయనకు ఘనసన్మానం చేశారు. ఈ సామాజిక సేవా కార్యక్రమాలు, ఒకే రోజులో 108 ఎం.జి. ఎఫ్. సభ్యత్వాలు నమోదు చేసి నందుకు ప్రతి ఫలంగా వాకర్స్ ఇంటర్ నేషనల్ తరపున వైస్ ప్రెసిడెంట్ అవార్డును అందజేశారనీ ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఎలెక్ట్ ఇంటర్ నేషనల్ప్రెసిడెంట్ డాక్టర్ రవిరాజు, మాజీ వైస్ ప్రెసిడెంట్ కోనేటి రావిరాజు, ఎలెక్ట్ గవర్నర్ మాధవ నాయుడు, రాజంపేట వాకర్స్ అసోసియేషన్ నుంచి కొండూరు సుబ్బరామరాజు , వెంకటయ్య, డాక్టర్ పెంచలయ్య, శివశంకర్ నాయుడు, దగ్గు పాటి రవి, జయచంద్ర రాజు సుబ్బరాజు, మల్లి, హరి, ప్రభాకర్రాజు రామచంద్ర, కె. ఎల్. ఎం. నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీజే రాయలసీమ ఇన్చార్జిగా అయూబ్

ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త:



స్థానిక జిన్నా రోడ్డులోని ఎంపీజే కార్యాలయంలో ఆదివారం మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ సభ్యత్వ నమోదు మరియు శిక్షణ కార్యక్రమ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీం కౌన్సిల్ మెంబర్ హుస్సేన్ అహ్మద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశం,రాష్ట్రంలో శాంతి న్యాయస్థాపన కొరకు ఎంపీజేలో చేరండని పిలుపునిచ్చారు. దేశ నిర్మాణానికి, సమాజ నిర్మాణానికి న్యాయ వ్యవస్థను సరళంగాను, చౌకగాను చేసి మానవ హక్కులను కాపాడటకు దేశంలో వివిధ మతాల మధ్య సోదరా భావం నెలకొల్పోడం మరియు శాంతి భద్రతలను కాపాడం కోసం, చేరాలన్నారు. జిల్లా అధ్యక్షుడు జాకీర్ ఉమ్రి మాట్లాడుతూ ప్రజలకు వైద్య, విద్యా, ఆహారం సమానంగాల భించినప్పుడే రాష్ట్రంలో ప్రజలు సుఖసంతోషాలతో ఉండగలరన్నారు. అనంతరం ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు. ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఎండి అయూబ్ ఖాన్‌ని ఎంపీజే రాయలసీమ ఇన్చార్జిగా నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి సలీం, అయూబ్ ఖాన్ మాట్లాడుతూ రాష్ట్ర బాధ్యులు నాపై నమ్మకం ఉంచి నాకు ఈ పదవి ఇచ్చిన వారికి ధన్యవాదాలు తెలుపుతూ ఈ పదవికి సరైన న్యాయం చేకూరుస్తానని నా బాధ్యతను నెరవేరుస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు హుస్సేన్ బాష, ఉపాధ్యక్షుడు నజీర్ అహమ్మద్, కార్యదర్శి మహమ్మద్ రఫీ, మీడియా కార్యదర్శి అస్లాం, కోశాధికారి ఇస్మాయిల్, సభ్యులు రవి, ముక్తయార్, సయ్యద్, ఇర్ఫాన్ సత్తార్ పాల్గొన్నారు.

## నేడు కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి, డిసెంబర్ 29 ప్రభాతవార్త

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 30న సోమవారం ఉదయం 10.00గం.ల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమాన్ని అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు.

# అభివద్ధి పథంలో పీలేరు పంచాయతీ

పీలేరు, డిసెంబరు 29 ప్రభాతవార్తః

నియోజకవర్గ కేంద్రం పీలేరు మేజర్ పంచాయతీ అవినీతి మరకను తొలగించుకుని పాలన ఇప్పుడే గాడిన పడుతోంది. గత వైకాపా పాలనలో పంచాయతీని ఎన్నికలు లేకుండా ఏకగ్రీవం చేసుకుని సర్పంచి కుర్చీలో కూర్చొన్నారు. దీంతో అడిగేవారు లేకపోవడంతో జవాబుదారీతనం లేకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించిన సర్పంచిలు భారీ స్థాయిలో నిధులు దుర్వినియోగానికి పాల్పడుతూ వచ్చారు. 2024 ఎన్నికల అనంతరం పీలేరు ఎమ్మెల్యేగా నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి భారీ మెజారిటీతో విజయం సాధించడం, ఇదే స్థాయిలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడం జరిగిపోయింది. ఈక్రమంలో గత వైకాపా ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలపై ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి గళం విప్పారు. ఉన్నతస్థాయి అధికారులతో విచారణ చేయించి పంచాయతీలో జరిగిన అవినీతి అక్రమాలను బయటపెట్టించారు. పంచాయతీలో రూ.1.40 కోట్లు అవినీతి జరిగినట్లు గుర్తించి, రూ.3కోట్లు అప్పులు చూపించినందుకు ఇద్దరు సర్పంచిలకు చెక్‌పవర్ రద్దుచేయగా ఈవోలుగా పనిచేసిన ముగ్గురిపై సస్పెన్షన్ వేటుపడింది. ఈక్రమంలో ఎమ్మెల్యే పీలేరు పంచాయతీపై ప్రత్యేక దష్టిసారించారు. కలికిరి ఈవోగా పనిచేస్తున్న గురుమోహన్‌ను పీలేరు మేజర్ పంచాయతీ ఇన్‌చార్జి ఈఓగా బాధ్యతలు అప్పచెప్పారు. ఎమ్మెల్యే సహకారంతో ఈవో గురుమోహన్ పీలేరు పంచాయతీని గాడిన పెట్టారు.

**- ఎమ్మెల్యే సహకారంతోనే :**



ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి సహాయ సహకారంతోనే పీలేరు మేజర్ పంచాయతీని అభివద్ధి పథంలో నడిపించడానికి కషిచేస్తున్నాం. ఇందుకోసం పంచాయతీ పరిధిలోని అధికారులు సిబ్బంది, పూర్తిసహకారం ఇస్తున్నారు. పంచాయతీని మరింత అభివద్ధి పథంలో నడిపించడానికి కావాల్సిన పనులు గుర్తించి నివేదికను ఎమ్మెల్యే సహకారంతో ఉన్నతాధికారులకు పంపాము. తక్షణ అభివద్ధి సాయం కింద రూ.20కోట్లు నిధులు అవసరమని అధికారులకు ప్రతిపాదనలు పంపాం. ఈనిధులు మంజూరైతే పంచాయతీని మరింత అభివద్ధి పథంలో నడిపిస్తాం.

**ఈఓ గురుమోహన్**

## కఠిన చర్యలు తీసుకోవాలి




లక్కిరెడ్డిపల్లి :డిసెంబర్ 29, ప్రభాతవార్త

దళితుడైన ఎంపిడీఓ జవహర్ బాబు పై ఆదిపత్య ధోరణితోనే గాలివీడుకు వైసీపీ మండలం నాయకుడు సుదర్శన్ రెడ్డి శుక్రవారం దాడి చేశాడని, దీనిని వైసీపీ నేత మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి సమర్థించడం దారుణం అని పిడియస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న అన్నారు లక్కిరెడ్డిపల్లె మండలం ఆదివారం దప్పేపల్లె పంచాయతీ జాండ్రపల్లెలో మాట్లాడుతూ.. గాలివీడు మండలానికి చెందిన వైసీపీ నేత సుదర్శన్ రెడ్డి తల్లి ఎంపిపి అయినప్పుడు ఆయనకు ఏ అధికారంతో ఎంపిపి కార్యాలయం తాళలు అడుగుతారు అనేది గుర్తించాలన్నారు. వైసీపీ నేత సుదర్శన్ రెడ్డికి ఏ అధికారం లేదనే ఎంపిడిఓ జవహర్ బాబు తాళలు ఇవ్వడానికి తిరస్కించారని, కానీ సుదర్శన్ రెడ్డి అహంకార ధోరణితో విచక్షణారహితంగా దాడి చేశాడని అన్నారు. ఇప్పటికే యావత్తు అన్నమయ్య,కడప జిల్లాకు చెందిన ప్రజా సంఘాలు, ఇతర ప్రభుత్వ పరిధిలో ఉన్న సంఘాలు కూడా ఖండించాయని గుర్తుకు చేశారు. తక్షణమే ఇలాంటి దాడులు జరగ కుండా ప్రభుత్వ ఉద్యోగులకు రక్షణ కల్పించే విధంగా ప్రత్యేక చట్టం చేయాలని, ఎంపిడిఓ జవహర్ బాబు పైన దాడి చేసిన సుదర్శన్ రెడ్డిపై హత్యయత్నం, ఎస్సి, ఎస్టీ కేసులు నమోదు చేయాలని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడియస్ యు నాయకులు ప్రవీణ్, షంషీర్, విష్ణువర్ధన్‌లు పాల్గొన్నారు.

## దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

రామాపురం; డిసెంబర్ 29, ప్రభాతవార్త



విధి నిర్వహణలో ఉన్న గాలివీడు ఎంపీడీవోపై దాడి చేసిన వైసీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. గాయపడి రిమ్స్ హాస్పిటల్ లో చికిత్స తీసుకుంటున్న ఎంపిడిఓ జవహర్‌బాబును ఆదివారం మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు అనంతరం మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. వైసిపి నాయకులు గత ఐదు సంవత్సరాలుగా ప్రజలపై మరియు ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేయడం వారికి అలవాటుగా మారిందని. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అలాంటి దాడులకు వారు ఇప్పటికైనా పూర్తిగా స్వస్తి పలకాలన్నారు. ప్రజల సంక్షేమం ప్రజల సుఖ సంతోషాలు కోరే ఈ ప్రభుత్వంలో ఎవరిపైన దాడులు జరిగినా సహించేది లేదని హెచ్చరించారు. చిన్న చిన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోకుండా ప్రభుత్వ అధికారులపై దాడి చేయడం ఎవరు క్షమించారన్నారు.గతంలో ప్రభుత్వ అధికారులపై దాడులు చేయడం వల్ల అధికారు, ప్రజలు వైసీపీకి మంచి గుణపాఠం చెప్పారన్నారు. గతంలో వైసిపి వారు చేసే అరాచకాలు అక్రమాలకు ప్రభుత్వ అధికారులు భయాందోళనకు గురి అయ్యేవారని దీంతో వైసీపీని నామరూపాలు లేకుండా తుడిచి వేయడం జరిగిందన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు, కార్యకర్తలు, తన పార్టీకి జరిగిన ఘోర పరాజయాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులపై దాడులను పూర్తిగా మానుకోవాలన్నారు.

## ప్రభుత్వ పాఠశాల భవనాలను పూర్తి చేయాలి

బ్రహ్మంగారి మఠం, డిసెంబర్ 29 ప్రభాతవార్త:

బ్రహ్మంగారిమఠం లోని ప్రభుత్వ పాఠశాలలో గత ప్రభుత్వంలో నాడునేడు పనులలో భాగంగా ఆగిపోయిన భవనలను పూర్తి చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఊసీ) డిమాండ్ చేస్తున్నారు, ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్ మాట్లాడుతూ మండలంలోని నాడునేడు పనులు ప్రభుత్వ పాఠశాలలు పూర్తిస్థాయిలో భవనం నిర్మించకుండా మధ్యలో ఆపడం జరిగింది, దీని వలన అక్కడ ఇటికలు, దిమ్మెలు, ఇసుక, కడ్డీలు, వంటివి నిలువ ఉండటం అక్కడ చదివే విద్యార్థులకు ఉపాధ్యాయులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది, ముఖ్యంగా బ్రహ్మంగారిమఠంలో బాలికల హై స్కూల్, సోమిరెడ్డిపల్లి ,పాపిరెడ్డిల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బంది కలిగించే విధంగా ఉందని, దీనికి అధికారుల, కాంట్రాక్టుల లోపం ఉందని కాబట్టి రాబోవు రోజుల్లో విద్యార్థులు పాఠశాల గదులు లేక ఇబ్బంది గురవుతారు,విద్యకు దూరమయ్యే అవకాశం ఉంది, కావున నాడునేడు పనులు పూర్తి చేయాలని, సొంత మండలం పైన ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ అభివృద్ధి పరిచే విధంగా చూడాలని విద్యార్థులకు విద్యను అందించే విధంగా చూడాలని ఎస్ఎఫ్ఐగా కోరుతున్నాము, కాబట్టి మండలంలో ఉన్న పాఠశాల భవనాలను పూర్తి చేయాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని తెలియజేస్తున్నారు.

## కళాకారుడు సత్తెన్న కుటుంబానికి న్యాయం చేస్తాం

గాలివీడు, డిసెంబర్ 29(ప్రభాతవార్త):

గత వారంలో హత్యకు గురైన కళాకారుడు సత్తన్న అలియాస్ వెంకటరమణ కుటుంబానికి న్యాయం చేస్తామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వడ్డెర సాధికారత సమితి కన్వీనర్ వెంకట్ పేర్కొన్నారు. ఆయన ఆదివారం నూలివీడు పంచాయతీ కొత్తబండివాండ్లపల్లెలోని హత్యకు గురైన కళాకారుడు సత్తెన్న కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వారి తల్లికి రూ.10 వేల ఆర్థికసహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రోజుల్లో ఇంత నవ నాగరికత కలిగిన సమాజంలో సాటి మనిషిని హత్య చేయడం అన్యాయమన్నారు. మూగ మహిళ అయిన తల్లిని నాటకాలు ఆడుతూ పోషించే సత్తన్నను హత్య చేయడం అమానుషమన్నారు. సత్తెన్నను అన్యాయంగా హత్య చేసిన వారికి యావజ్జీవ కారాగార శిక్ష విధించాలని తెలిపారు. మృతుని కుటుంబానికి స్థానిక రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డితో చర్చించి ప్రభుత్వపరంగా సహాయ సహకారాలు అందించడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సేవాదళ్ అధ్యక్షులు పవన్‌కుమార్, స్థానిక వడ్డెర నాయకులు జగన్నాధ, మేస్త్రీ వెంకటరమణ, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



## మానవతా సంస్థ సభ్యుల సమావేశం




వాల్మీకిపురం, డిసెంబర్ 29, ప్రభాతవార్త ః

మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 2025 కొత్త ఏడాదిలో మరిన్ని సేవా కార్యక్రమాలతో పాటు కొత్త ప్రణాళికలతో ముందుకెళ్లామని మానవతా సంస్థ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక సత్యసాయి సేవా సమావేశ మందిరంలో మానవతా స్వచ్ఛంద సంస్థ సభ్యుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశాన్ని ఉద్దేశించి కృష్ణమూర్తి మాట్లాడుతూ ప్రజలతో పాటు యువతలో సేవాభావం పెంపొందే విధంగా కొత్త ఏడాదిలో నూతన ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. సంస్థలోకి మరింత మంది విశ్రాంత ఉద్యోగులు, యువత రావాలని, తద్వారా సేవా కార్యక్రమాల విస్కృతం చేద్దామని పిలుపు నిచ్చారు. ప్రస్తుతం సంస్థ ద్వారా వైకుంఠ రథం, ఫ్రీజర్ బాక్సులు, బహిరంగ ప్రదేశాల్లో ప్రయాణికులు, ప్రజలు సేద తీరేందుకు బల్లలు ఏర్పాటు చేయడం, మొక్కలు నాటడంతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో ముందుకెళ్తున్నామన్నారు. కొత్త ఏడాదిలో ఈ సేవలను గ్రామీణప్రాంతాలకు విస్తరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రంలో సంస్థ సభ్యులు కేశవరెడ్డి, రామకృష్ణారెడ్డి, తాండాయి రవి, శంకర, చంద్ర, పీవీ, సత్యనారాయణ, మురళి, రాజారెడ్డి, లక్ష్మన్న, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 31న రాత్రి రోడ్లపై సంబరాలు నిషేధం

వాల్మీకిపురం డిసెంబర్ 29 ప్రభాతవార్త ః



డిసెంబరు 31 వతేదీ మంగళవారం అర్ధరాత్రి నూతన సంవత్సరం సందర్భంగా రోడ్లపై సంబరాలు పూర్తిగా నిషేధమని వాల్మీకిపురం సీఐ ప్రసాద్ బాబు హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ న్యూ ఇయర్ వేడుకలు,సంబరాలు పూర్తిగా ఇళ్ళకే పరిమితం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా యువత రోడ్లపై బైక్ లతో శృతి మించి శబ్దాలు చెయ్యడం, రహదారులపై కేకులు కట్ చేసి వాహనాలకు ఇబ్బందులు కలిగించడం లాంటివి జరిగితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా యువత బైక్ లలో రోడ్లపై తిరుగుతూ కనిపిస్తే వాహనాలు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. సర్కిల్ పరిధిలోని గుర్రంకొండ, వాల్మీకిపురం మండలాల వ్యాప్తంగా గట్టి నిఘా పెట్టడం జరిగిందని న్యూ ఇయర్ వేడుకల పేరుతో రోడ్లపై తిరుగుతూ కనిపిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. న్యూ ఇయర్ సందర్భంగా తల్లి దండ్రులు కూడా తమ పిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రజలు కూడా ఏవైనా ఇబ్బందులు ఎదురైతే పోలీసులకు సమాచారం ఇస్తే తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు.

## మట్కా నిర్వహణపై ఎమ్మెల్యే వరద తీరు స్పష్టం చేయాలి

ప్రొద్దుటూరు డిసెంబర్ 29 ప్రభాతవార్త




ప్రొద్దుటూరులో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై ఎమ్మెల్యే నంద్యాల వరదరాజురెడ్డి తీరును స్పష్టం చేయాలని మున్సిపల్ వైస్ ఛైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రొద్దుటూరులో టిడిపి నాయకులు అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడంలో స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి తనయుడు టిడిపి రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి అండదండలు ఉన్నాయని విమర్శించారు. టిడిపికి చెందిన కౌన్సిలర్ మట్కా నిర్వహిస్తున్నారని పోలీసులు కేసులు నమోదు చేశారని పలు పత్రికలలో కథనాలు వచ్చాయన్నారు. అందుకు అనుగుణంగా ఆ వ్యక్తి పై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని గుర్తు చేశారు. ప్రొద్దుటూరులో అసాంఘిక కార్యకలాపాలు లేవని అలాంటి వాటిపై ఉక్కు పాదం మోపుతాను అన్న ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మట్కా నిర్వహిస్తున్న టిడిపి కౌన్సిలర్ ను పార్టీ నుండి సస్పెండ్ చేయడమే కాకుండా పదవికి రాజీనామా చేయించాలని స్పష్టం చేశారు. కావున అసాంఘిక కార్యకలాపాలపై ఎమ్మెల్యే మాట్లాడేముందు వారి వర్గీయులు నిర్వహించకుండా చేయాలని సూచించారు. టిడిపి వారే అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తూ తమపై అబండాలు మోపడం సరి కాదన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు గురునాథరెడ్డి, నల్లదేశి జంగమయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాయలసీమ ప్రాంత వాసులను అవమానించేలా పవన్ వ్యాఖ్యలు

ప్రొద్దుటూరు డిసెంబర్ 29 ప్రభాతవార్త

రాయలసీమ ప్రాంత వాసులను ముఖ్యంగా కడప జిల్లా ప్రజలను అవమానపరిచేలా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలు చేశారని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి విమర్శించారు. ఆదివారం స్థానిక వైఎంఆర్ కాలనీలోని వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శనివారం కడప జిల్లాలో ఎంపిడీవోపై దాడి చేసిన నేపథ్యంలో జిల్లా కు విచ్చేశారని ఆయన ఆ సందర్భంగా మాట్లాడిన మాటలు రాయలసీమ వాసులను, మరీ ముఖ్యంగా కడప జిల్లా వాసులను, రెడ్డి కులస్తులను కించపరిచేలా వున్నాయని విమర్శించారు. తాము ఎంపిడీవోపై జరిగిన దాడిని సమర్థించడం లేదని, ప్రభుత్వ అధికారుల విధులకు ఎవరు ఆటంకం కల్పించినా ఉపేక్షించేంది లేదని, ప్రభుత్వాధికారులు ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే శాంతియుత ధర్నాలు, కోర్టుల ద్వారా పోరాడాలే కానీ దాడులు సరైన విధానం కాదని, కానీ ఆ దాడికి కారణమైన వ్యక్తి పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు ఆక్షేపణీయం అన్నారు. ఎంపీడీఓ విధులకు ఆటంకం కల్పిస్తే చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని, దళిత నాయకులు కావడం వలన అట్రాసిటీ కేసులు పెట్టాలే కానీ పోలీసుల తీరు ఆమోద యోగ్యం కాదన్నారు. పదేపదే వైసీపీ కి 11 సీట్లు వచ్చాయని చెబుతున్న పవన్ కళ్యాణ్ 2019లో ఆయన పార్టీకి 1 సీట్ వచ్చి, చంద్రబాబు కు 24 సీట్లు వచ్చి నేడు అధికారం లోకి వచ్చారని, తాము భవిష్యత్తులో అధికారంలోకి వస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ భీమునిపల్లె లక్ష్మిదేవి నాగరాజు, కౌన్సిలర్లు గుర్రం లావణ్య, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## అభిట్రస్ట్ ఆధ్వర్యంలో వృద్ధుడికి అంత్యక్రియలు

యర్రగుంట్ల డిసెంబర్ 29 ప్రభాతవార్త



తిప్పలూరు గ్రామంలో ఎద్దుల పెద్ద శేషమ్మ వృద్ధాశ్రమంలో గత ఎనిమిది నెలల నుంచి అనాధ ఆశ్రమంలో ఉంటూ జీవనం కొనసాగిస్తూ ఉండేవాడు. ఈ వృద్ధుడు యాదన్న (70 ) హైదరాబాద్ చెందినవ్యక్తి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని ఆశ్రమం నిర్వాహకుడు నాగేంద్ర అభి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌కు డాక్టర్ ఎన్ విజయబాబుకు విషయం తెలుపగా అక్కడికి వెళ్లి సాంప్రదాయ పద్ధతిలో అంతక్రియలు నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎన్ విజయ్‌బాబు, నాగేంద్ర ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాధలను అభాగ్యులను ఆదరించడం అన్నం పెట్టడం మరియు అంత్యక్రియలు చేయటం మహా పుణ్యకార్యం అన్నారు, అలాగే ఎవరు లేకుండా మరణించిన వారికి మేమున్నామంటూ అనాధగా కాకుండా సంప్రదాయపద్ధంగా అంత్యక్రియలు నిర్వహిస్తున్నామని అన్నారు, ఎన్ని కష్టాలొచ్చినా ఎదుర్కొంటూ మానవత్వం కలిగిన మాకు దైవానుగ్రహంతోనే కార్యక్రమాలన్నీ ట్రస్ట్ ద్వారా చేస్తున్నామని తెలిపారు, ఈ కార్యక్రమంలో సురేంద్ర, దిలీప్ ట్రస్ట్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## వన్య ప్రాణుల రక్షణ మనందరి బాధ్యత

బద్వేలు లీగల్, డిశంబరు 29 ప్రభాతవార్త :

మన దేశంలో వన్య ప్రాణుల వేట మాత్రమేగాక కొన్ని జంతువులను, పక్షులను పెంచుకోవడం కూడా నేరమే. స్వేచ్ఛగా తిరగకుండా ఆయా ప్రాణులను ఒక చోట బంధీ చేయడం చట్ట రీత్యా నేరంగా పరిగణిస్తారు. దేశంలో వన్య ప్రాణి సంరక్షణ చట్టం (వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్)-1972వ సంవత్సరం ఆగష్టు నెల 21వ తేదీన అమలు లోనికి వచ్చి ఇప్పటికి సుమారు 52 సంవత్సరములు గడిచింది. ఈ చట్టం ప్రకారం అడవి జంతువులను, పక్షులను వేటాడడం, హింసించడం, గాయపరచడం, వాటిని నాశనం చేయడం, శరీర భాగాలను తీసుకోవడం నేరాలుగా పరిగణిస్తారు. ప్రాకుడు జీవులైన పాములు వంటి సరీ సృపాలను చంపడము, పక్షుల గూళ్ళను కదల్చడం, నాశనం చేయడం కూడా శిక్షార్హమే. దీంతో పాటు కొన్ని రకాల జంతువులను, పక్షులను పెంచుకోవడం కూడా నేరమే. వన్య ప్రాణి సంస్థ అనుమతి లేకుండా ఆయా పార్కులు, వన్య ప్రాణి కేంద్రాల సరిహద్దులను రాష్ట్ర ప్రభుత్వాలు కూడా మార్చుటకు వీలు లేదు. ఈ చట్టం అంత కఠినమైనదేగాక విస్తృతమైనది కూడా. ఈ చట్ట ప్రకారం పులులు, సింహాలు వంటి క్రూరమైన జంతువులేగాక కొన్ని సాదు జంతువులను కూడా పెంచుకోరాదు. తాబేళ్ళలో ఇండియన్ స్టార్, రెడ్డియర్స్, స్లైడర్ వంటి రకాలను కూడా పెంచకూడదు. సముద్ర జీవులను వాటి నిజ స్థావరాల నుండి బయటికి తెచ్చి అక్వేరియం లేదా పాత్రలలో పెంచడం చట్ట విరుద్ధము, చట్ట రీత్యా నేరం కూడా. చిలుకలలో ఓ రకమైన ప్యారా కీట్స్, నెమళ్ళు, కోయిలలు, మునియా వంటి పక్షుల పెంపకము కూడా నేరమే. వినోదం కోసం కోతులను పెంచడం లేదా శిక్షణ ఇవ్వడాన్ని కూడా నేరంగా పరిగణించబడుతుంది. అందుకే జంతువులను, పక్షులను పెంచుకోవాలనుకున్నపుడు వన్య ప్రాణి సంరక్షణ చట్టంలోని అంశాలను తెలుసుకోవడం మంచిది లేదంటే నేరంతో కూడిన శిక్షార్హులవుతారు. తస్మాత్ జాగ్రత్త! అని చట్టం చెబుతోంది.

## నేడు పురపాలక సర్వ సభ్య సమావేశం

మైదుకూరు,డిసెంబర్ 29, ప్రభాతవార్త:

మైదుకూరు పురపాలక సర్వసభ్య సమావేశం సోమవారం వనిపెంట రోడ్డు తెలుగు గంగ కాలనీలోని మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర సమావేశము నిర్వహించనున్నట్లు పురపాలక కమిషనర్ యం. శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. పురపాలక కౌన్సిల్ సభ్యులు అధికారులు హాజరుకావాలని కోరారు.

## ఎంపీడీవోపై దాడి అమానుషం

కడప కార్పొరేషన్ డిసెంబర్ 29 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టి గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డా .కె వి రమణ, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నాయకులు బాబుమోజస్‌ల ఆధ్వర్యంలో, అగ్రవర్ణాల దాడికి గురై రిమ్స్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న ఎంపీడీవో జవహర్‌బాబు ఎస్సీ ఎస్టీ ఉద్యోగ సంఘాల వారు పరామర్శించడం జరిగినది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కేవీ రమణ మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఎస్సీ ఎస్టీ ఉద్యోగస్తుల పైన దాడులు ఏమాత్రం తగ్గడం లేదని బాధను వ్యక్తం చేశారు. ఎంపీడీవో జవహర్ బాబు రూల్స్ ప్రకారంగా వ్యవహరిస్తూ, నిజాయితీగా తమ నిధులను నిర్వహించడాన్ని సహించలేని సుదర్శన్ రెడ్డి తన అనుచరులు విచక్షణ రహితంగా దాడి చేయడం దారుణంమన్నారు. ఎంపీడీవో పైన దాడి చేసి మానసిక మనోవేదనకు గురి చేసినటువంటి వారిని తీవ్రంగా శిక్షించాలని కోరారు. ఇటువంటివి భవిష్యత్తులో జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, హోం శాఖ మాత్యులు అనితలను కోరారు. ప్రభుత్వం తీసుకునేటువంటి చర్యల ద్వారా మరెవరైనా ఎస్సీ ఎస్టీ ఉద్యోగస్తుల మీద దాడి చేయాలంటే భయం పుట్టి విధముగా చర్యలు ఉండాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అడ్వైజర్ ది.జు .రమణ, గొల్లపల్లి భాస్కర్, రామకృష్ణ లెక్చరర్, మాధవరావు లెక్చరర్, శంకరయ్య ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చింతల్ రాయుడు, గుర్రప్ప, శోభన్ బాబుతదితర సంఘ నాయకులు జోహార్ బాబు ఎంపీడీవోని పరామర్శించిన వారిలో ఉన్నారు.

## సిఆర్సి కుమారుడు విష్ణుకు నివాళులు

కడప కార్పొరేషన్ 29 డిసెంబర్ ప్రభాతవార్త:



టీడీపీ ఎమ్మెల్సీ చెన్నం శెట్టి రామచంద్రయ్య కుమారుడు విష్ణు శనివారం గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమని మాజీ డిప్యూటీ మేయర్ బి.అరిఫుల్లా అన్నారు. ఆదివారం మాజీ డిప్యూటీ మేయర్ అరిపుల్లా కడప నగరంలోని సిఆర్సి నివాస గృహంలో విష్ణు పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ రామచంద్రయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో 28 వ డివిజన్ టీడీపీ నేత అబ్దుల్లా పాల్గొనీ నివాళులు అర్పించారు.

## లక్కిరెడ్డిపల్లి తాలూకా ఏపీ ఎన్జీవో అధ్యక్షుడిగా కొండూరు బలరామరాజు

లక్కిరెడ్డిపల్లె; డిసెంబరు 29, ప్రభాతవార్త



లక్కిరెడ్డిపల్లి తాలూకా ఏపీ ఎన్జీవో అధ్యక్షుడిగా కొండూరు బలరామరాజు సహాయ అధ్యక్షులుగా ఆర్ జయచంద్ర కార్యదర్శిగా విశ్వనాథలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఆదివారం స్థానిక ఎన్జీ హోమ్ లో ఈ ఎన్నిక జరిగింది ఈ సందర్భంగా ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రాష్ట్ర ఉపాధ్యక్షులు వై ప్రసాద్ యాదవ్ అధ్యక్షతన కార్యవర్గం ఎంపిక జరిగింది అధ్యక్షులుగా బలరాం రాజు, కార్యదర్శి విశ్వనాథ్, కోశాధికారిగా రవీంద్ర నాయక్ ఉపాధ్యక్షులుగా నీలోఫర్ బేగం రామకృష్ణ ఎం సురేందర్ రెడ్డి దేవదానం జాయింట్ సెక్రెటరీగా కృష్ణప్ప ,వెంకటలక్ష్మి ,బేగం సుబ్బయ్య ఆర్గనైజింగ్ సెక్రటరీగా అంజనమ్మ ఎగ్జిక్యూటివ్ కమిటీ నెంబర్లుగా ఎస్ సాహెబ్ పీర్ ,రామతులసి, జి అరుణ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవో అధ్యక్షులు బలరామరాజు మాట్లాడుతూ మూడు పర్యాయాలుగా లక్కిరెడ్డిపల్లి తాలూకా ఎన్జీ హోమ్ అధ్యక్షుడిగా ఎన్నుకోవడం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ మరియు కమిటీ సభ్యులు ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు ఉద్యోగులకు అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకుంటామని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో బాజీ ఎన్జీవో నేతలు వెంకటరమణ రవిశంకర్ ప్రసాద్ రాయచోటి ఎన్జీవో సెక్రటరీ వెంకటేశ్వర్ రెడ్డి ఉద్యోగస్తులు పెన్షనర్లు పాల్గొన్నారు

## వైకాపా హయాంలోనే
# ప్రజలపై పన్నుల భారం
### ఎమ్మెల్యే షాజహాన్‌బాషా




మదనపల్లె, డిసెంబర్ 29 ప్రభాతవార్త :
వైకాపా ప్రభుత్వ హయాంలోనే ప్రజలపై పన్నుల భారం మోపారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం ఆయన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందని వైకాపా నాయకులు పోరుబాటు నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ళలో 9పర్యాయాలు విద్యుత్ చార్జీలు పెంచి సామాన్య ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. అంతేకాకుండా ఆస్థిపన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు పెంపు, చెత్తపై పన్ను విధించి ప్రజలను వచ్చించారన్నారు. రాష్ట్ర ఆస్తులన్నీ తాకట్టు పెట్టి ఖజానాన్ని ఖాళీ చేశారన్నారు. మైనింగ్, ఇసుక, లిక్కర్ స్కామింగ్‌లో వైకాపా నాయకులు కూరుకుపోయారన్నారు. వీరి అరాచక పాలనకు ఎన్నికల్లో ప్రజల తీర్పు 11మందికే పరిమితమైందన్నారు. అయినా జగన్‌మోహన్‌రెడ్డి గతాన్ని మరిచి కూటమి ప్రభుత్వంపై బురద చల్లేందుకు వివిధ పేర్లతో ప్రజల వద్దకు వస్తున్నారన్నారు. సిఎంఎఫ్ పేరుతో జగన్ గ్రామీణ, మండల పరిషత్, మున్సిపల్ నిధులన్నీ ఖాళీ చేసి ఆ వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేశారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. తాను ఎప్పుడూ ప్రజల మద్యనే ఉంటున్నానని, ప్రజాసమస్యల పరిష్కారమే తన ధ్యేయం అన్నారు. గాలివీడు ఎండిఓపై దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. ఆరునెలల్లో నియోజకవర్గంలో కోట్లాదిరుపాయలు అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆర్‌జె.వెంకటేష్, ఎస్‌ఎ.మస్తాన్, మోడెం సిద్దప్ప, బిల్లెప్రసాద్, భారతి, రాటకొండ మధుబాబు, జేసిబి మధు, వేణు, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, గుత్తికొండ త్యాగరాజు, నాగమణి, శివ, నవీన్‌చౌదరి, గాంధీ తదితరులు పాల్గొన్నారు.


## మదనపల్లె చేనేతకు బ్రాండ్
# ప్రభుత్వాలు మారినా రాలా?
### వేలాది కుటుంబాల జీవనాధారం ఇక్కడే



మదనపల్లె, డిసెంబర్ 29 ప్రభాతవార్త :
ప్రభుత్వాలు మారుతున్నా...మదనపల్లె చేనేతకు బ్రాండ్ లేకపోయే...సంవత్సరాలు మారుతున్నాయి..ఎన్నికల్లో హామీలిస్తారు... బ్రాండు...కలేనా..? అంటూ చేనేతలు ఆలోచనలు పడ్డారు. పట్టుచీరలంటే మహిళలకు మక్కువే...రాష్ట్రంలో మదనపల్లె పట్టుచీరలంటే గుర్తుకు వస్తాయో గాని వాటి బ్రాండ్‌కు గుర్తింపు రాలేదు. ధర్మవరం, పొద్దుటూరు, వెంకటగిరి పట్టుచీరల కంటే మదనపల్లె చీరలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. కానీ పట్టుచీరలు పేరు వినగానే వెంకటగిరి, ధర్మవరం, కంచి వంటి పట్టణాల పేర్లు వినపడుతాయి. మదనపల్లె నీరుగట్టువారిపల్లెకు చెందిన పట్టుచీరలకు బ్రాండ్ లేకపోవడంతో బయట ప్రాంతాల్లో ప్రాధాన్యత తక్కువ అవుతుంది. రాష్ట్రంలోనే అత్యధిక మంది చేనేత వ్యాపారులు, కార్మికులు, చేనేత మగ్గాలు మదనపల్లెలోనే ఉన్నాయి. 80వేల మగ్గాలు, లక్ష మంది కార్మికులు, 10వేలమందికి పైగా వ్యాపారులు ఇక్కడ నివాసం ఉంటున్నారు. ఒక్కప్పుడు చేనేత మగ్గానికి ఎంతో ప్రాధాన్యత ఉండేది. వీటి ద్వారా తయారైన చీరలే బయట ప్రాంతాలకు ఎగుమతి చేసి అమ్మకాలు జరిపే వారు. ఎప్పుడైతే హ్యాండ్‌లూమ్, అధునాతనమైన యంత్రాలతో తయారు చేసిన పట్టుచీరలు మార్కెట్‌లోకి రావడంతో చేనేత మగ్గం రానురాను కుంటుపడింది. ఒక్కరోజుకు యంత్రాల ద్వారా పలు చీరలను తయారు చేసే సామర్థ్యం ఉంది. అదే చేనేత మగ్గంతో ఒక్కరోజుకు ఒక్క చీరకూడా తయారు చేయలేని పరిస్థితి ఉంది. అయినప్పటికి కార్మికులను ఎక్కువ మంది ఉంచి నీరుగట్టువారిపల్లెలో మగ్గాల ద్వారా రాత్రింబవళ్ళు చీరలను తయారు చేయడం జరుగుతుంది. మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లెలో వేలాది మంది కార్మికులు జీవనాదారం చేసుకొని జీవిస్తున్నారు. నాణ్యమైన ఒక్క చీరను తయారు చేయాలంటే మగ్గం నేసే వ్యక్తికి అధికంగానే ఖర్చు అవుతుంది. తయారైన చీరను లాభాలకు అమ్మాలి కాని నష్టాలకు అమ్మే పరిస్థితి ఏర్పడుతోంది. కారణం ముడిసరుకు ధరలు పెరగడం, ఎప్పటికప్పుడు తయారైన చీరలు అమ్మకాలు జరగకపోవడం వల్ల నష్టాలకు అమ్ముకోవాల్సి వస్తుంది. నేతన్నచే తయారైన చీరలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తే వీరు లాభాలు పొందే అవకాశం ఉంటుంది. ఇక్కడి చేనేత కార్మికులు పోటీతత్వంకు దీటుగా రకరకాల డిజైన్లతో చీరలను తయారు చేయాల్సి ఉంది. ఒకే రకం కాకుండా పలు రకాలతో తయారు చేస్తే వినియోగదారులు కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ఇప్పుడున్న మార్కెట్‌లో చీరలు రంగురంగుల డిజైన్లతో ఆకట్టుకునేలా కార్మికులు మార్చుకోవాల్సి ఉంది. లేకపోతే ఇలాగే మరిన్ని నష్టాలు పొందాల్సి ఉంటుంది. ఇప్పటికే పలువురు అప్పులు పాలై మగ్గాలను నిలిపివేసి వేరే వ్యాపారులపై ఆధారపడుతున్నారు. కనీసం ఇప్పటికైనా బ్రాండ్ కల్పించాలని చేనేతలు కోరుతున్నారు.







## శివాలయంలో లలిత సామూహిక
# కోటినామ పారాయణం



ప్రొద్దుటూరు, డిసెంబర్ 27, ప్రభాతవార్త
ప్రొద్దుటూరు పట్టణంలో వెలసిన శ్రీ అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో పారాయణ కమిటీ అధ్యక్షులు బూతురు వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు సామూహిక లలితా కోటినామ పారాయణం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. లోక కళ్యాణార్థం ఈ సామూహిక లలితా పారాయణం 1000 మంది భక్తులతో నిర్వహించినట్లు బూతూరు వెంకటరామిరెడ్డి తెలిపారు. పారాయణం లో పాల్గొన్న భక్తులకు టిడిపి బీసీ నాయకులు మరియు ప్రొద్దుటూరు కృష్ణలయ్య కమిటీ చైర్మన్ చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి సుమారు 1500 ల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. అన్న ప్రసాద కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు చల్లా రాజగోపాల్ యాదవ్ ప్రొద్దుటూరు పట్టణంలో చేస్తున్న అన్నదాన కార్యక్రమాల గురించి విన్నామని నేడు ప్రత్యక్షంగా తాము భోజనం చేసిన తర్వాత ఆయన చేస్తున్న అన్నదానం మన ఇంటిలో భోజనం కంటే ఎంతో రుచికరంగా ఉందని వారు ఆ తృప్తిని వ్యక్తం చేస్తూ అన్నదాత రాజగోపాల్ యాదవ్ కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## హామీలు విస్మరించిన కూటమి ప్రభుత్వం
### రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



మదనపల్లె, డిసెంబర్ 29 ప్రభాతవార్త :
ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంపి మాట్లాడుతూ పెన్షన్ పథకం తప్పా ఏ పథకమూ కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని ఏద్దేవా చేశారు. గత ప్రభుత్వ హాయాంలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మదనపల్లెకు మంజూరు అయిన వాటిని కూడా కూటమి ప్రభుత్వం రద్దు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యంగా పట్టణంలో ఎంతో చరిత్ర కలిగిన బిటి కళాశాలను యూనివర్శిటీగా మార్చేందుకు వైకాపా ప్రభుత్వం జీఓ తీసుకురావడం జరిగిందన్నారు. అదే విధంగా మెడికల్ కళాశాలను మంజూరు చేయడం జరిగిందన్నారు. మెడికల్ కళాశాల అడ్మిషన్లను, బిటి కళాశాల యూనివర్శిటి కూటమి ప్రభుత్వం అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం అన్నారు. ఈ రెండు అమలులో ఉంటే మదనపల్లె ఎంతో అభివృద్ధి చెందేదన్నారు. గత ఎన్నికల హామీలను విస్మర్మించి అభివృద్ధిని కూడా అడ్డుకొంటోందన్నారు. విద్యుత్ చార్జీలు పెంచి సామాన్య ప్రజల నడ్డి విరుస్తొందన్నారు. ప్రజల పక్షాన వైకాపా నాయకులు ప్రభుత్వాన్ని నిలదీస్తే కేసుల పేరుతో వైకాపా కార్యకర్తలను భయపెట్టిస్తొందన్నారు. ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను చేపట్టి విఫలం చెందుతుందన్నారు. బిటి కళాశాలను యూనివర్శిటి చేసి మెడికల్ కళాశాలను యదావిధిగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్ ఛైర్మెన్ జింకాచలపతి, షమీంఅస్లాం, బాబ్‌జాన్, లియాఖత్, ఆనంద పార్థసారధిలు పాల్గొన్నారు.

## హైందవ శంఖారావానికి తరలిరండి
### పట్టణంలో విశ్వపరిషత్‌చే ర్యాలీ

మదనపల్లె, డిసెంబర్ 29 ప్రభాతవార్త :
విజయవాడలో జనవరి 5న జరిగే హైందవ శంఖారావానికి హిందువులు తరలిరావాలని విశ్వహిందూపరిషత్ జిల్లా కార్యదర్శి సురేష్ తెలిపారు. ఆదివారం పట్టణంలో విశ్వహిందూ పరిషత్‌చే పెద్దఎత్తున హిందువులు ర్యాలీ నిర్వహించారు. టిటిడి కళ్యాణ మండపం నుంచి అంబేద్కర్ సర్కిల్, సిటిఎం రోడ్డు, చిత్తూరు బస్టాండు, నెహ్రూబజార్, శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. బండెన్నస్వామి ర్యాలీని జెండాఊపి ప్రారంభించారు. పెద్దఎత్తున హిందువులు హైందవ శంఖారావానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పి పట్టణ అధ్యక్షులు రామ్మోహన్‌రెడ్డి, హిందూ చైతన్యవేధిక నాయకులు బాలాజి, బిజెపినాయకులు ఎల్లంపల్లి ప్రశాంత్, ఆకుల క్రిష్ణమూర్తి, ఆనంద్, జర్మనిరాజు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి
### ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్

మదనపల్లె, డిసెంబర్ 29 ప్రభాతవార్త :
పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంటును విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధమ సభక ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దేశానికి సేవ చేసిన నేతల చరిత్రలను పాఠ్యాంశాల నుంచి తొలగించి దేశానికి ద్రోహం చేసిన నేతల గురించి పాఠ్యాంశాలలో చేర్చడం అన్యాయమన్నారు. గత పదేళ్ళలో బిజెపి ప్రభుత్వం విద్యారంగాన్ని సర్వనాశనం చేసిందన్నారు. విశాఖలో ఉక్కు పరిశ్రమ కోసం ఎంతోమంది విద్యార్థులు ప్రాణత్యాగం చేశారని, నష్టాల సాకుతో విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తుందన్నారు. విద్యతో పాటు వ్యవసాయ, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసేందుకు బిజెపి ప్రయత్నాలు కొనసాగిస్తొందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఐక్యంగా పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పరమేశ్ మాట్లాడుతూ విద్యారంగ సంస్థలపై అనునిత్యం పోరాటాలు చేస్తున్న ఏకైక జెండా ఎస్‌ఎఫ్‌ఐ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహా, ఉపాధ్యక్షులు రమణ, నాయకులు హరేంద్రనాధ్‌శర్మ, శ్రీనివాసులు, మదన్‌మోహన్, గిరి, ఆఫ్రీద్, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.



## రచయితల మహాసభలో పీలేరు కవులు



పీలేరు, డిసెంబరు 29 ప్రభాతవార్తః
విజయవాడలో జరిగిన ప్రపంచ ఆరవ తెలుగు రచయితల మహాసభలకు పీలేరు నుంచి కవులు మురళీధర్‌రాజు, శ్రీరాములరాజు, జీవి. నటరాజన్ లు హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుబాషాభివద్ధి, విశిష్టతను కాపాడటానికి సాహితీ కార్యక్రమాలు నిర్వహించారని ఇందులో భాగంగా కవి సమ్మేళనంలో పాల్గొన్నామని వీరు అన్నారు. తెలుగుబాషా వికాసం, తెలుగుజాతి ప్రకాశం కోసం పాటుపడాలని ఈకవులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా శాసనమండలి ఛైర్మన్ బుద్ధ ప్రసాద్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, సుప్రీం కోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి ఎన్‌వి. రమణచే జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

## వైసిపి పాలనలో విద్యుత్ చార్జీలు
# 10 సార్లు పెంచినది గుర్తులేదా
### ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి



ప్రొద్దుటూరు డిసెంబర్ 29 ప్రభాతవార్త
గత వైసిపి పాలనలో ప్రజలకు తెలియకుండానే పదిసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిన సంగతి వైసీపీ నాయకులకు గుర్తు లేదా అని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ పాలనలో పదిసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారం మోపారని ఆయన విమర్శించారు. తిరిగి కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచిందని వైసిపి నిరసనలు చేపట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత వైసిపి పాలనలో అభివృద్ధి శూన్యమని, పంచాయతీలను నిర్వీర్యం చేశారని, ప్రభుత్వ భూములు, చర్చి భూములు కబ్జా చేశారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వంలో ఎక్కడా ఒక్క రోడ్డు కూడా వేయలేదని, దారుణంగా ఉన్న రోడ్లు వేస్తున్నామని వివరించారు. ప్రజా సంక్షేమం కోసం శ్రమించే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అని, ప్రజల అవసరాల కోసం కావాల్సిన ఇసుక ప్రజలకు అందుబాటులో ఉందని, ప్రజలకు చెప్పిన సూపర్ సిక్స్ పథకాలు మొదలు పెట్టామని తెలియజేశారు. ఆదాని ముడుపుల విషయంలో విచారణ చేపట్టామని సొంత చెల్లెలు షర్మిల కోరడం జగన్ అవినీతికి పరాకాష్ఠ అన్నారు. కూటమి ప్రభుత్వం ను విమర్శించే నైతిక హక్కు జగన్మోహన్ రెడ్డికి లేదని తెలిపారు. ప్రొద్దుటూరులోని జగనన్న కాలనీలలో జరిగిన అవినీతిపై విచారణ జరుగుతోందని, నిజానిజాలు వెల్లడి కానున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ ఇంచార్జ్ ఛైర్మన్ ముక్తియార్, కొత్తపల్లి సర్పంచ్ శివచంద్రారెడ్డి, నాయకులు పగిడాల దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.


## మండలంలో వేగంగా గోకుల్‌షెడ్ నిర్మాణాలు



కలికిరి, డిసెంబరు 29, ప్రభాతవార్త:
మండలంలోని 14 గ్రామ పంచాయతీలలో రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం మంజూరు చేసిన గోకుల్ షెడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పశువుల సంక్షేమం కోసం సీఎం నారా చంద్రబాబునాయుడు గ్రామాల్లో గోకుల షెడ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ నిర్మాణ పనులు జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా చేపట్టేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసి గోకుల షెడ్లు మంజూరు చేయడం జరిగింది. మండలంలో 25 గోకుల షెడ్లు మంజూరు చేయడం జరిగింది. ఈ నిర్మాణ పనులు ఎంపీడీవో భానుమూర్తిరావు ఉపాధి హామీ పథకం ఏపీవో సుజాత పర్యవేక్షణలో జరుగుతున్నాయి. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు మనోహర్, రెడ్డిబాషా, రవీంద్ర, బొజ్జమ్మలు ప్రతినిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ నిర్మాణ పనులపై రైతులకు అవగాహన కల్పిస్తూ షెడ్లు నిర్మాణ పనులు వేగంగా అయ్యేలా కృషి చేస్తున్నారు. దీంతో మండలంలోని పంచాయతీలో ఇప్పటికే షెడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తయి ప్రారంభోత్సవాలకు సిద్ధంగా ఉన్నాయి. మరికొన్ని వివిధ స్థాయిలలో రైతులు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రైతులు తొందరగా గోకుల షెడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయాలని రైతులకు ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## నాగార్పమ్మ తల్లికి పట్టు వస్త్రాలతో పూజలు

సుండుపల్లె, డిసెంబర్ 29,ప్రభాతవార్త:
మండల పరిధిలోని పెద్దినేని కాలువ గ్రామపంచాయతీ బండకాడ ఈడిగ పల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మ తల్లి సంతానం లేని వారికి సంతానం ప్రసాదించి, భక్తుల కోరికలు తీర్చే బంగారు కల్పవల్లిగా ప్రసిద్ధిగాంచినది. ఆదివారం ఉదయాన్నే పూజారులు అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని బోనాలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



## సగబాల రాజన్న కవి సంపుటి బహుకరణ

ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త:
విజయవాడలో జరిగిన 6వ ప్రపంచ తెలుగు రచయితల మహాసభలో 2వ రోజు జరిగిన కవి సమ్మేళనానికి సిరికొండ నరసింహా రాజు అధ్యక్షత వహించగా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి చెందిన ఓఎస్డి డాక్టర్ ఎం ప్రభాకర్ దివంగత సగబాల రాజన్న కవి రచించిన పుస్తక సంపుటి గ్రంధాన్ని ఆదివారం ఆంధ్రప్రదేశ్ ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కి, ఏపీ హైకోర్టు జస్టిస్ ఆకుల వెంకట శేష సాయి, జస్టిస్ మన్మధరావు,తెలంగాణ హైకోర్టు జస్టిస్ లక్ష్మణ్, మండలి బుద్ధ ప్రసాద్, సినీ గేయ రచయిత భువనచంద్ర, మండలి బుద్ధ ప్రసాద్ తదితరులకు అందించారు.



## విద్యార్థులు క్రీడల్లో విధిగా పాల్గొనాలి
### కౌన్సిలర్ గాజుల శివ జ్యోతి



ప్రొద్దుటూరు అర్బన్, డిసెంబర్ 29 ప్రభాతవార్త :
ప్రొద్దుటూరు చెస్ టోర్నమెంట్ వారి ఆధ్వర్యంలో అండర్ 15 ప్రొద్దుటూరులోని పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ఆదివారం స్థానిక కొరపాడు రోడ్డులోని శివశంకర్ షాపింగ్ కాంప్లెక్స్ లో పోటీలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న 33 వ వార్డు టిడిపి కౌన్సిలర్ గాజుల శివ జ్యోతి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పాఠశాల సెలవు దినాల్లో విద్యార్థులు చాలా వరకు సెల్‌ఫోన్‌లోకి అంకితం అయి వారి కంటి చూపులు శారీర దృఢత్వం కోల్పోతున్నారని ఈ అండర్ 15 చెస్ క్రీడాకారులను పిల్లలు ఆదర్శంగా తీసుకొని స్కూల్ విద్యార్థులు కాలేజీ పిల్లలు యుక్త వయసు పిల్లలు అంతా ఏదో ఒక క్రీడలో అలవాటు చేసుకుని తల్లిదండ్రులకు చదువుకుంటున్న పాఠశాలకు పుట్టిన ఊరికి పేరు ప్రఖ్యాతలు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులు ఇమామ్ హుస్సేన్ టిఎస్టియుసి జిల్లా అధ్యక్షులు చింతకుంట కుతుబుద్దీన్ ప్రొద్దుటూరు చెస్ క్లబ్ నిర్వాహకులు రెడ్డి పవన్, ఆర్బిటర్ ముజమిల్ పాల్గొన్నారు.

## మానవతా సేవలు అభినందనీయం



లక్కిరెడ్డిపల్లి ; డిసెంబర్ 29 ,ప్రభాతవార్త
మానవతా సేవా స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని మానవతా సమస్త అధ్యక్షులు డాక్టర్ యస్ యమ్ డి షపి నాయక్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మానవతా సమస్త సమావేశంనికి ముఖ్య అతిథులుగా సెంట్రల్ కమిటీ డైరెక్టర్ వై. ప్రసాద్ యాదవ్, కన్వినర్ ఆర్ శివయ్య పాల్గొన్నారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్వరలో అన్ని స్కూల్స్ నందు మానవతా ఆధ్వర్యంలో విద్యార్థుల కు నైతిక విలువలు పై అవగాహనా కల్పించి మెరిట్ విద్యార్థులకు నగదు బహుమతులు ఇస్తామన్నారు. అధ్యక్షులు డాక్టర్ షఫి మాట్లాడుతూ ఇప్పటికే 4 ఫ్రిజేర్ బాక్స్ లు ఒక శాంతి ర్నథ పనిచేస్తున్నాయని. పేద విద్యార్థుల ఎవరైనా ఉన్నట్లులైతే వారికి మానవతా తరుపున దాతల సహాకారం తో ఆర్థిక సహాయం చేస్తామన్నారు. అనంతరం. బలరాం రాజు మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి మానవతా సేవలు అభినందనీయమని. మంచి సేవలు చేస్తున్నారని ఎలాంటి సహాయం కావాలన్నా నేను చేస్తనన్నారు. మానవతా సభ్యులు కె బలరామరాజును ఘనంగా సన్మానం చేసారు. ఈ కార్యక్రమంలో మానవతా డైరెక్టర్ రమణారావు, కోశాధికారి పి.రవిశంకర్, కార్యదర్శి బి శ్రీనివాసులు,శంకర్ ప్రసాద్,వి వి రమణ, రామక్రిష్ణ, విఆర్‌వో కృష్ణయ, గంగయ్య రామచంద్ర పాల్గొన్నారు

## ఘనంగా అనంతపురం గంగమ్మకు పూజలు

లక్కిరెడ్డిపల్లి : డిసెంబర్ 29, ప్రభాతవార్త
మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో వెలసియున్న గంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు వచ్చిన భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ప్రత్యేక అధికారి శ్రీనివాసులు అన్ని ఏర్పాట్లు చేశారు అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు పూజ కార్యక్రమాలు నిర్వహించారు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో క్యూ లైన్లన్నీ కిక్కిరిసి పోయాయి ఆలయ ప్రాంగణమంతా భక్తులు కిక్కిరిసింది చెల్లు వంశీయులు పోలీస్ గంగాధర్ యాదవ్ వచ్చిన భక్తులకు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి వచ్చిన భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాసులు ఆలయ సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, నాగేశ్వరమ్మ, మార్కండేయ, భక్తులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రమాదం అంచున విద్యుత్ స్తంభం

మైదుకూరు, డిసెంబర్ 29, ప్రభాతవార్త:
మైదుకూరు మున్సిపాలిటీలోని బద్వేల్ రోడ్డు నిర్మల వికలాంగుల హాస్టల్ స్కూల్ వెళ్లే దారిలో కేసీ కెనాల్ పక్కన ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం ఒరిగి ఉన్నది. విద్యుత్ స్తంభం వైర్ల సహాయంతో అలా ఉందని స్థానిక ప్రజలు తెలియజేశారు. విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాన్ని సరిచేయాలని తెలియజేశారు. మైదుకూరు పట్టణ ప్రజలకు గత కొన్ని రోజులుగా విద్యుత్ అంతరాయం ఎక్కువగా ఉందని గతంలో మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్లు ఎమ్మెల్యే గారికి మొరపెట్టుకున్న ఎలాంటి మార్పు లేదని ఈ విషయాన్ని సోమవారం సర్వసభ సమావేశంలో ఎమ్మెల్యే చొరవ తీసుకొని విద్యుత్ అధికారులకు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని మున్సిపాలిటీ పట్టణ ప్రజలు వేడుకుంటున్నారు.



## ఉపముఖ్యమంత్రి చొరవతో 11072 రోడ్డుపనులు

మదనపల్లెక్రైం, డిసెంబర్ 29 ప్రభాతవార్త :
రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాలతో కేవలం 50రోజుల్లో 11072 సిసి రోడ్డు పనులు చేయటం దేశచరిత్రలోనే ఓ రికార్డ్‌ని జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మైఫోర్స్ మహేష్ అన్నారు. ఆయన ఆదివారం జనసేన పార్టీ కార్యలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ పంచాయితీరాజ్‌శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పవన్‌కళ్యాణ్ సిమెంట్‌రోడ్డు పనులకు అంగీకారం తెలిపారు. దీంతో 50 రోజుల్లో 11072 సిసి రోడ్డులు చేపట్టడం జరిగిందన్నారు. పంచాయితీలకు భారీగా నిధులు విడుదల చేయటంతో పంచాయితీల్లో పనులు త్వరితగతిన పూర్తి అవుతున్నాయన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో 5ఏళ్లలో కనీసం 5000 రోడ్డులు కూడా వేయలేకపోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మరో దశాబ్దం పాటు అధికారంలో వుంటే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందటం ఖాయమన్నారు. అవినీతికి దూరంగా పాలన సాగించటమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. దానివల్లే ప్రజలకు మంచి జరుగుతోందన్నారు. రాష్ట్రంలోని ప్రజలందరూ పవన్‌కళ్యాణ్‌కు చేయూతనివ్వాలని కోరారు. అనంతరం పవన్‌కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు అమరనారాయణ, శోభ, భవ్య, సందీప్‌రెడ్డి, రమణారెడ్డి, చిరంజీవి, అప్పర్‌బాషా, నాగేంద్ర, దేవేంద్ర, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

